J/NELLORE/003/24-26 R.N.I.No.25359/74 పేజీలు : 12

THE BEST TELUGU WEEKLY OF NELLOREANS




# లాయర్

సంపుటి : 45 సంచిక : 50 15.5.2026, శుక్రవారం వెల : రూ. 10/-
వ్యవస్థాపకులు : తుంగా రాజగోపాలరెడ్డి
సంపాదకులు : తుంగా శివప్రభాత్‌రెడ్డి



# మోడీ మాట బంగారు బాట!

- ఏడాది పాటు పసిడి కొనవద్దన్న ప్రధాని
- పియం వ్యాఖ్యలపై సర్వత్రా చర్చ
- ఆసక్తి రేపుతున్న ఆర్థికాంశాలు

*'క్రయ విక్రయాలు దేశ ఆర్థిక వ్యవస్థకు జవసత్వాలు.' ఇదీ ఆర్థికవేత్తల మాట. రవాణా మార్గాలు, పర్యాటక ప్రదేశాల్లో చేపట్టే టూర్లు దేశ ప్రజల ఆర్థిక స్తోమతని వారి ఆసక్తులను తెలియజేస్తాయి. ఇక బంగారం, వెండి వంటి లోహాల కొనుగోలు వారి ఆర్థిక శక్తి సామర్థ్యాలకు నిదర్శనాలు. అలాంటిది ఓ దేశ ప్రధాని ఏడాది పాటు ప్రజలు పొదుపు పాటించాలని, బంగారం, వెండి వంటి ఖరీదైన లోహాలను అసలే కొనొద్దని చెప్పడం దేశ వ్యాప్తంగా చర్చనీయాంశమైంది. ఇక పారిశ్రామిక, సేవా రంగాలకు చెందిన సంస్థలు సైతం ఆన్‌లైన్ మీటింగులకు, వర్క్‌ఫ్రమ్ హోంకు ప్రాధాన్యత ఇవ్వాలని సూచించడం, అనవసర ప్రయాణాలు చేయొద్దని చెప్పడం, రసాయన ఎరువులు, విదేశీ వస్తువులు వాడొద్దని పిలుపునివ్వడం అత్యంత ఆసక్తిని, ఓ విధంగా భవిష్యత్‌పై ఆందోళననూ కలుగజేస్తోంది.*

ఈనేపథ్యంలో.. అసలెందుకు ప్రధాని బంగారం కొనద్దంటున్నారు...? డీజిల్ పెట్రోల్ వాడకం తగ్గించాలని అంటున్నారు, వృథా ఖర్చులు, విలాసాలు అసలే వద్దంటున్నారు అనే అంశాలు, అటు ఆర్థిక వేత్తల్లోనూ, ఇటు సామాన్య, మధ్యతరగతి ప్రజల్లోనూ చర్చకు దారితీస్తున్నాయి. లోతుల్లోకెళ్లి పరిశీలిస్తే, అదో దీర్ఘకాలిక వ్యూహంగానూ, ఒడిదొడుకుల ప్రయాణం సాగిస్తున్న దేశ ఆర్థిక రంగానికి, ఊతకర్రగానూ ఉపయోగపడుతుందనే మాటలు ఆర్థిక నిపుణుల నుంచి వినపడుతున్నాయి. ప్రస్తుత పరిస్థితుల్లో మోడీ మాట దేశ భవిష్యత్ అవసరాలను తీర్చే బంగారు బాట అని వారు అభిప్రాయపడుతున్నారు.

## మోడీ సప్తపది..!


2024 ఎన్నికల తర్వాత తొలిసారి ప్రధాని మోడీ ఇటీవల తెలంగాణలో పర్యటించారు. పలు అభివృద్ధి కార్యక్రమాలకు శంకుస్థాపనలు, ప్రారంభోత్సవాలు చేపట్టారు. తర్వాత బహిరంగ సభ నిర్వహించి అనేక అంశాలపై తన మనోగతాన్ని వెల్లడించారు. అయితే ఆసక్తికరంగా దేశ ప్రజల రోజువారీ వ్యవహారాలతో ముడిపడిన అంశాలపై కీలక వ్యాఖ్యలు చేశారు. దీంతో అవి ప్రస్తుతం చిన్నా, పెద్ద, ముసలీ ముతక, పండితుడు, పామరుడనే తేడా లేకుండా అందరూ చర్చించుకునేలా చేస్తున్నాయి. అసలు మోడీ చెప్పిన ఏడు అంశాలు వాటి వెనుక దాగున్న ఆర్థిక రహస్యాలను పరిశీలిస్తే, అసామాన్యమైన విషయాలు అంతర్గతంగా ఆలోచించాల్సిన అంశాలు బోలెడు స్ఫురిస్తాయి.

మోడీ సప్తపదిలో మొదటి అంశం ఏడాది పాటు దేశ ప్రజలు బంగారం కొనుగోళ్లను పూర్తిగా నిలిపివేయాలి. రెండోది పెట్రోల్, డీజిల్ వాడకం తగ్గించాలి, మూడోది వర్క్‌ఫ్రం హోం, ఆన్‌లైన్ మీటింగ్‌లకు ప్రాధాన్యత పెంచాలి. నాలుగోది విదేశీ

2లో

మహా మనీషికి
శ్రద్ధాంజలి

ఉత్తమ సంస్కారం, ఉన్నత విలువలతో
కుటుంబ బాంధవ్యాలను నెరిపిన మృదుస్వభావి,
లక్షలాది మందికి ఉపాధి కల్పించి, చక్కెర పరిశ్రమలో
వినూత్నమైన అధ్యాయానికి శ్రీకారం చుట్టిన మహోన్నతుడు
శ్రీ రావి సుధాకర్ చౌదరి గారు
తేది. 10.05.2026 ఆదివారం స్వర్గస్తులైనారు.
వారి పవిత్ర ఆత్మకు శాంతి కలగాలని భగవంతుని ప్రార్థిస్తూ...
శ్రద్ధాంజలి ఘటిస్తున్నాము.



శ్రీ రావి సుధాకర్ చౌదరి గారు
డైరెక్టర్ : శ్రీ సర్వారాయ షుగర్స్ లిమిటెడ్
చెల్లూరు, తూర్పుగోదావరి జిల్లా.
ఈదూరు, తోటపల్లిగూడూరు మండలం, నెల్లూరుజిల్లా.
జననం : 08.09.1943 మరణం : 10.05.2026

భార్య : రావి లలిత
మరియు
కుటుంబసభ్యులు

ఉత్తరక్రియలు
తేది. 20.05.2026 బుధవారం
ఉ॥ 11 గంటలకు హైదరాబాద్‌లోని జూబ్లీహిల్స్ ఇంటర్నేషనల్ సెంటర్
(రోడ్ నెం.14, జూబ్లీహిల్స్) హాల్ నెం.2 నందు జరుగును.
కావున బంధుమిత్రులకు తెలియజేయడమైనది.

# డెంగ్యూపై అప్రమత్తత అవసరం

● డీఎంఅండ్‌హెచ్‌ఓ డాక్టర్ సుజాత

డెంగ్యూ వ్యాధి పట్ల అందరూ అప్రమత్తంగా ఉండాలని, వ్యాధి రాకుండా ముందస్తు జాగ్రత్తలు తీసుకోవాలని డీఎంఅండ్‌హెచ్‌ఓ డాక్టర్ సుజాత పిలుపునిచ్చారు. ఈనెల 13న నెల్లూరులోని తమ చాంబర్‌లో నిర్వహించిన ఆరోగ్య అధికారుల సమావేశంలో ఆమె డెంగ్యూ నివారణకు తీసుకోవాల్సిన జాగ్రత్తలను వివరించే పోస్టర్లను ఆవిష్కరించారు. ఈనెల 16న జాతీయ డెంగ్యూ నివారణ దినోత్సవం సందర్భంగా జిల్లావ్యాప్తంగా ఉన్న పీహెచ్‌సీలు, సీహెచ్‌సీలలో డెంగ్యూ అవగాహన సదస్సులు, సమావేశాలు నిర్వహించాలన్నారు. డీఐఓ ఉమామహేశ్వరి, జిల్లా మలేరియా ఇన్‌చార్జి అధికారి అంశుధర్, ఎన్‌హెచ్‌ఎం సునీల్, జయరామ్ తదితరులు పాల్గొన్నారు.

## కాలధర్మం

## రావి సుధాకర్ చౌదరి



రాష్ట్ర వ్యవసాయశాఖలో వివిధ హోదాల్లో పనిచేసి, పలు చక్కెర ఫ్యాక్టరీలలో సీనియర్ అధికారిగా అత్యుత్తమస్థాయిలో విధులు నిర్వహించి, అటు చెరకు రైతులకు ఇటు చక్కెర ఫ్యాక్టరీల అభివృద్ధికి సుమారు యాభైఏళ్లపాటు ఎనలేని సేవలందించి ఎన్నో అవార్డులు సాధించిన రావి సుధాకర్‌చౌదరి.. మే 10 ఆదివారం నాడు కాలధర్మం చెందారు. అనారోగ్యంతో చికిత్స పొందుతూ, హైదరాబాద్‌లోని తమ నివాసంలో ఆయన తుదిశ్వాస విడిచారు. ఆయనకు భార్య, ఇద్దరు కుమార్తెలున్నారు. ప్రముఖ ఆధ్యాత్మిక సేవాపరాయణుడు.. తెలుగుదేశం పార్టీ కర్నాటక శాఖ కోఆర్డినేటర్ రావి మోహన్‌చౌదరి ఈయన సోదరుడే.

నెల్లూరుజిల్లా తోటపల్లిగూడూరు మండలం ఈదూరు రావి సుధాకర్‌చౌదరి సొంతూరు. నెల్లూరుజిల్లా తోటపల్లిగూడూరు మండలంలోని ఈదూరు గ్రామంలో ఆయన 1943 సెప్టెంబరు 8న జన్మించారు. తల్లితండ్రులు దివంగత రావి సుబ్బరామానాయుడు–లక్ష్మమ్మ. చిన్నతనం నుంచి చదువుపై, పరిశోధనలపై ప్రత్యేక ఆసక్తి ఉండేది. బీఎస్సీ (అగ్రికల్చర్) చదివి, ఎంఎస్సి (ఎస్‌సిపి) పూర్తిచేసి, 1968–69లో పశ్చిమగోదావరి జిల్లా చాగొల్లులో వ్యవసాయ ఇన్స్‌పెక్టర్‌గా ఆయన ఉద్యోగ జీవితాన్ని ప్రారంభించారు. ఆ తర్వాత నుంచి వ్యవసాయశాఖలో అదనపు వ్యవసాయ అధికారిగా, సీనియర్ అధికారిగా, ప్రధాన అధికారిగా కూడా బాధ్యతలు చేపట్టి, ఎక్కడ పనిచేసినా–ఏ స్థాయిలో ఉన్నా క్రమశిక్షణతో విధులు నిర్వహించి అందరి మన్ననలు అందుకున్నారు.

చక్కెర ఫ్యాక్టరీలకి సంబంధించి కేన్ మేనేజర్‌గా ఉంటూ, తన సమర్థవంతమైన కృషి ద్వారా 1986–1990 ప్రాంతాల్లో రాష్ట్రంలోనే అత్యధిక చక్కెర శాతాన్ని నమోదు చేసి రికార్డు సాధించారు. తూర్పు గోదావరిజిల్లా చెల్లూరులోని సర్వారాయ షుగర్స్ లిమిటెడ్‌లో పనిచేసి, సమర్థవంతమైన అధికారిగా పేరు తెచ్చుకున్నారు. అంతర్జాతీయ నాణ్యతగల చక్కెరని ఉత్పత్తిచేసే ఆ ఫ్యాక్టరీకి ఆయన చీఫ్ ఎగ్జిక్యూటివ్‌గా కూడా పనిచేశారు. ఆయన సారథ్యంలో ఈ ఫ్యాక్టరీ రాష్ట్రం మొత్తంలోనే అత్యధిక చక్కెర ఉత్పత్తి చేసిన ఘనత సాధించుకుంది. ఆ చక్కెరమిల్లుకి, డిస్టిలరీకి, కో–జనరేషన్ విద్యుత్ ప్లాంట్‌కి కూడా రావి సుధకర్ చౌదరి ఇన్‌చార్జి అధికారిగా పనిచేసి, డిస్టిలరీ సామర్థ్యాన్ని రోజుకి పాతికవేల లీటర్ల నుంచి 30వేల లీటర్లకు పెంచారు. సర్వారాయ షుగర్స్‌ని ఇంటిగ్రేటెడ్ ప్లాంట్‌గా రూపొందించి ఇథనాల్, బాట్లింగ్ యూనిట్, కోకాకోలా అన్ని ఫ్లేవర్స్, కిన్లీ వాటర్ ఫ్రాంచైజెస్‌కి కూడా ఇన్‌చార్జిగా ఉంటూ తన సమర్థతను నిరూపించుకున్నారు. ఆ డిస్టిలరీ నుంచి వెలువడే వ్యర్థాలను సేంద్రీయ ఎరువుగా తయారుచేసే ప్రక్రియ ప్రారంభించింది కూడా ఆయన పర్యవేక్షణలోనే.

దక్షిణభారత చెరకు మరియు చక్కెర సాంకేతిక నిపుణుల సంఘం (సిస్టా) ఉపాధ్యక్షులుగా ఆయన పనిచేశారు. సిస్టా అధ్యక్షునిగా కూడా ఉండి, రాష్ట్ర రాష్ట్రేతర ప్రాంతాల్లో కూడా సమావేశాలు పెట్టి, చెరకు అభివృద్ధి కోసం ఆయన చేసిన కృషి అపారం..అమూల్యం! 2015లో భారత చక్కెర సాంకేతిక నిపుణుల సంఘం–స్టాయ్ ఆధ్వర్యంలో, అప్పటి ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడు సహకార షుగర్ ఫ్యాక్టరీల పనితీరును అధ్యయనం చేయడానికి రావి సుధాకర్‌చౌదరి నేతృత్వంలో నిపుణుల కమిటీని నియమించడం విశేషం. ఈ దశలో ఆయన భారతదేశంలోని ముఖ్యమైన చక్కెర కర్మాగారాలను, చెరకు పరిశోధనా కేంద్రాలను సందర్శించారు. అంతేకాదు బ్రెజిల్, హవాయి, దక్షిణాఫ్రికా, మారిషస్, ఫిలిప్పీన్స్, ఆస్ట్రేలియా తదితర దేశాలకు కూడా వెళ్ళి చక్కెర పరిశ్రమలకి సంబంధించిన అన్ని విషయాలపై అధ్యయనం చేశారు కూడా. ఒక్కమాటలో చెప్పాలంటే ఆయన జీవితమంతా చెరకు–చక్కెర ఫ్యాక్టరీల్లోనే గడిచిపోయింది. ఆయా రంగాల్లో అపారమైన అనుభవాన్ని సంపాదించుకుని, తన ప్రజ్ఞాపాటవాలతో, నిరంతర కృషితో ఆయా కంపెనీలకు గణనీయమైన అభివృద్ధిని సాధించిపెట్టిన సుధాకర్‌చౌదరి సేవలు విస్మరించలేనివి. ఆయన నెల్లూరీయులు కావడం సింహపురిసీమకే గర్వకారణం.

రావి సుధాకర్ చౌదరి నిబద్ధతతో కృషిచేస్తూ చెరకు–చక్కెర కర్మాగారాలకు అపారమైన సేవలందించి రాష్ట్ర, జాతీయస్థాయిలో కూడా ఎన్నో విశిష్టమైన అవార్డులను అందుకున్నారు. రాష్ట్రంలో అత్యధిక చెరకు క్రషింగ్ చేసినందుకు విశిష్టమైన పార్థసారథి అవార్డును, భారత చక్కెర పరిశ్రమల అభివృద్ధికి అత్యుత్తమస్థాయిలో కృషి చేసినందుకు జీవన సాఫల్య పురస్కారాన్ని కూడా అందుకోవడం ఆయన అపూర్వ కృషికి నిదర్శనం. ఇంతటి అమోఘమైన ప్రజ్ఞావంతుడు లేకపోవడం వ్యవసాయశాఖకే కాదు.. భారత చక్కెర పరిశ్రమలకి కూడా ఒక పెద్ద లోటు. ఆయన మృతికి చింతిస్తూ, వారి కుటుంబానికి ప్రగాఢ సంతాపం తెలుపుతోంది..'లాయర్'!...

# మోడీ మాట బంగారు బాట!

(మొదటిపేజీ తరువాయి)

పర్యటనలు అసలే చేయకూడదు. ఐదోది ప్రజలు వంటల్లో నూనెల వినియోగం తగ్గించాలి. ఆరోది రైతులు తమ సాగుబడిలో రసాయన ఎరువుల వినియోగం తగ్గించాలి. ఏడోది స్వదేశీ వస్తువులనే ఉపయోగించాలి, డబ్బులు వృథా చేయకుండా విలాసాలకు కత్తెర వేయాలి. వీటన్నింటినీ పరిశీలిస్తే మొత్తం మీద ప్రజలు డబ్బును పెద్దగా ఖర్చుపెట్టకూడదని, పొదుపు మంత్రం పాటించాలన్నది ప్రధాని ముఖ్య సూచనగా అర్థమవుతోంది. అయితే ఏదేశమైనా ఆర్థికంగా ఎదగాలంటే ప్రజలు కొనుగోలు శక్తి పెరగాలి. పౌరులు ఎన్ని వస్తువులను ఎంత పెద్దమొత్తంలో కొంటే దేశానికి అంత ఆదాయం వస్తుంది. దేశ ఆర్థిక రంగానికి అంతగా పన్ను రాబడి పెరుగుతుంది. అయితే వీటికి విరుద్ధంగా ప్రధాని పొదుపు మంత్రం పాటించమనడం, ముఖ్యంగా దేశ ప్రజల సాంప్రదాయాలకు, సెంటిమెంట్స్, ఎమోషన్స్‌తో ముడిపడిన బంగారాన్ని కొనవద్దనడం అన్ని రంగాల ప్రజలను ఉలిక్కిపడేలా చేసింది. ప్రధాని సూచించిన మిగిలిన సూచనల కంటే ప్రస్తుతం బంగారం కొనొద్దన్న విషయమే అన్నింటికంటే ఎక్కువగా ప్రజల్లో చర్చనీయాంశమైంది. అసలు మోదీ సూచన వెనకున్న ఆర్థిక సూత్రాన్ని తెలుసుకుంటే మాత్రం ఔరా అనాల్సిందే.

### ప్రస్తుత దేశ ఆర్థిక పరిస్థితిని పరిశీలిస్తే..

భారత దేశం విస్తీర్ణ పరంగా ప్రపంచంలో ఏడో స్థానంలో ఉంది. అతిపెద్ద ఆర్థిక వ్యవస్థల్లో నాలుగైదు, స్థానాల్లో కొనసాగుతోంది. అయితే ప్రజల తలసరి ఆదాయం, తలసరి వ్యయం విషయంలో అట్టడుగు స్థానాల్లో కొట్టుమిట్టాడుతోంది. అలాగే ప్రజల సగటు ఆయుర్దాయం, శిశు మరణాలు, విద్య, వైద్య ఆరోగ్య రంగాల్లో క్రమంగా అభివృద్ధి చెందుతున్న దశలో ఉంది. దీనికితోడు కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు లక్షలాది కోట్లును ఐఎంఎఫ్ (ఇంటర్నేషనల్ మానిటర్ ఫండ్), ప్రపంచ బ్యాంక్, ఆసియా అభివృద్ధి బ్యాంక్ వంటి సంస్థల నుంచి అప్పులుగా తెస్తోంది. వాటి ద్వారా సంక్షేమ, అభివృద్ధి కార్యక్రమాలు, దేశంలో మౌలిక వసతుల కల్పన చేపడుతున్నారు. అదే సమయంలో మనదేశం, విదేశాల నుంచి ముడిచమురు (పెట్రోల్, డీజిల్), బంగారం, వంటనూనెలు, ఎరువులను పెద్దఎత్తున దిగుమతి చేసుకుంటోంది. ఈ లావాదేవీలన్నీ దాదాపుగా అమెరికా డాలర్ల రూపంలోనే ఉంటాయి. ఇందుకోసం మనదేశ ఆర్థిక వ్యవస్థకు దిక్సూచీగా చెప్పుకునే రిజర్వ్ బ్యాంక్ విదేశీ మారక ద్రవ్య నిల్వలను ఎప్పటికప్పుడు పెంచుకునేలా వ్యూహాలు రచిస్తోంది. అయితే అంతర్జాతీయంగా నెలకొంటున్న యుద్ధ పరిస్థితులు, మనదేశంలో వస్తున్న వివిధ మార్పుల కారణంగా మనదేశ రిజర్వ్ బ్యాంక్ వద్ద విదేశీ మారక ద్రవ్య నిల్వలు తగ్గిపోతున్నాయి. అయితే వీటిని పెంచుకునేందుకు రిజర్వ్ బ్యాంక్ మనదేశం నుంచి ఇతర దేశాలకు వస్తు సేవల ఎగుమతులను పెంచడం, విదేశీ పెట్టుబడులను ఆకర్షించడం, ఫార్మాస్యూటికల్స్ విక్రయించడం, ఐటీ రంగాల సేవలను విస్తరించడం, విదేశాల్లో స్థిరపడిన భారతీయుల సంపాదన (డాలర్లను తీసుకుని వాటికి సరిపడా రూపాయిలు ఇవ్వడం)పై ఆధారపడుతోంది. అయితే భారతదేశం చేస్తున్న అప్పులు, వస్తువుల దిగుమతి కోసం అవసరమైనదానికంటే ఎక్కువ అమెరికా డాలర్లు(విదేశీ మారక ద్రవ్యం) మనదేశానికి అవసరమౌతున్నాయి. ఈనేపథ్యంలో మనం ప్రధానంగా దిగుమతి చేసుకునే పెట్రోల్, డీజిల్, రసాయన ఎరువులు, వంట నూనెలు వంటి వస్తువుల ద్వారా అటు ప్రజా వినియోగంతోపాటు కేంద్రానికి పన్నుల రూపంలో కొంత మొత్తం ఆదాయంగా చేకూరుతోంది. అయితే బంగారం నుంచి మాత్రం ప్రభుత్వానికి పెద్దగా పన్ను ఆదాయం సమకూరడం లేదు. దీనికి ప్రధాన కారణం ప్రజలు తమ వద్ద ఉన్న నల్లధనాన్ని కాపాడుకోవడం కోసం నగదు కొనుగోళ్లు (క్యాష్ ట్రాన్సాక్షన్‌)కే ప్రాధాన్యత ఇస్తున్నారు. డిజిటల్ కొనుగోళ్లకు పెద్దగా మొగ్గు చూపడం లేదు. అదే సమయంలో బంగారాన్ని ఆభరణాల రూపంలో కొనుగోలు చేసి ఇళ్లలో దాచిపెట్టుకుంటున్నారు. ఫలితంగా ప్రజల ఆదాయం ఆర్థిక వ్యవస్థలో చెలామణిలో లేకుండా పోతోంది. ప్రజలు తమ ఆదాయాన్ని వివిధ వస్తువుల కొనుగోళ్లు అమ్మకాల రూపంలో సర్క్యులేట్ చేస్తేనే ప్రభుత్వానికి వివిధ రకాలుగా ఆదాయం వస్తుంది. అయితే ప్రజలు ఏళ్ల తరబడి డబ్బును పొదుపు చేసి బంగారం కొని ఇళ్లలో దాచిపెట్టుకోవడం వల్ల ప్రభుత్వ ఆదాయానికి భారీగా గండిపడుతోంది. దీంతో మన వద్ద ఉన్న విదేశీ మారక ద్రవ్య నిల్వలు బంగారం దిగుమతి కోసం తగ్గిపోవడమే కాకుండా దేశ ఆర్థిక వ్యవస్థ బలోపేతానికి ఏమాత్రం సహాయకారి కావడం లేదు. ఈ కారణంగానే మోడీ బంగారం కొనుగోళ్లను వెంటనే ప్రజలు నిలిపివేసి తమ ఆదాయాన్ని ఇతర వస్తు సేవల కొనుగోలు కోసం వినియోగించాలని సూచిస్తున్నారు. ఇదే సమయంలో డీజిల్, పెట్రోల్ వంటి వాటి వినియోగాన్ని తగ్గిస్తే దేశం దిగుమతి చేసుకునే ముడిచమురు పరిమాణం కూడా తగ్గిపోతుంది. తద్వారా మన విదేశీ మారకద్రవ్య నిల్వలను కాపాడుకునే అవకాశం ఉంటుంది. వాటిని కేంద్రం తీసుకునే రుణాలు చెల్లించేందుకు వినియోగించవచ్చు. తద్వారా దేశం రుణగ్రస్తం కాకుండా కాపాడుకోవడమే కాకుండా రూపాయి విలువ పడిపోకుండా జాగ్రత్త పడొచ్చు. ఈ కారణంగానే ప్రధాని మోడీ బంగారం కొనొద్దని, వృథా ప్రయాణాలు, విదేశీ పర్యటనలకు స్వస్తి పలకాలని సూచిస్తున్నారు. ఇప్పటికే ప్రపంచంలో పదో శాతానికిపైగా దేశాలు వివిధ కారణాలతో యుద్ధరంగంలో ఉన్నాయి. అంతర్గత సంక్షోభాలతో కొట్టుమిట్టాడుతున్నాయి. అందువల్ల నిరంతరం క్రూడ్ ఆయిల్ ధరలు, బంగారం ధరలు అస్థిరంగా ఉంటూ ఎప్పటికప్పుడు పెరిగిపోతున్నాయి. ఈ నేపథ్యంలో ప్రపంచంలోనే అత్యధిక జనాభా ఉన్న మనదేశంలో కూడా ప్రజల ప్రాథమిక అవసరాల కోసం ప్రభుత్వం అప్పులు, వస్తుసేవల దిగుమతి కోసం పెద్దమొత్తంలో ఆదాయాన్ని వెచ్చించాల్సి వస్తోంది. తద్వారా ప్రజల జీవన ప్రమాణాన్ని పెంచే సంక్షేమ పథకాలు, అభివృద్ధి పథకాలకు అవసరమై నిధులు లేకుండా పోతున్నాయి. ఫలితంగా వివిధ రంగాలు కుదేలవుతున్నాయి. పరిస్థితి ఇలాగే కొనసాగితే అభివృద్ధి చెందుతున్న దేశం కాస్తా భవిష్యత్‌లో అభివృద్ధి చెందిన దేశం మాట అటుంచి పేదదేశంగా మారి ఆకలి దప్పులకు, కరువు కాటకాలకు నిలయమయ్యే అవకాశం ఉంది. ఆ పరిస్థితి రాకుండా ఉండాలంటే మన రూపాయి బలపడాలి, ద్రవ్యోల్బణం పెరగకుండా చూడాలి. ప్రభుత్వానికి పన్నుల ద్వారా వచ్చే ఆదాయం పెరగాలి, ఇవన్నీ జరగాలంటే మనదేశం వెంటనే దిగుమతి చేసుకునే వస్తువుల సంఖ్యను గణనీయంగా తగ్గించాలి. ముఖ్యంగా దేశ ఆర్థిక వ్యవస్థకు పెనుభారంగా మారిన డీజిల్, పెట్రోల్, ఎరువులు, వంటనూనెల వంటి వాటి దిగుమతిని వెంటనే అనేక రెట్లు తగ్గించాలి. ముఖ్యంగా విదేశీ మారక ద్రవ్య నిల్వలను తినేస్తూ దేశంలో డబ్బు చెలామణిని కట్టడి చేస్తున్న బంగారం కొనుగోళ్లను వెంటనే ఆపాలి. అత్యంత ముఖ్యమైన సందర్భాల్లో తప్ప పసిడి జోలికి జనం వెళ్లకుంటేనే మంచిది. ఒకవేళ భవిష్యత్ అవసరాల కోసం డబ్బును బంగారం రూపంలో దాచి పెట్టాలనుకుంటే ప్రభుత్వం సూచిస్తున్నట్లు డిజిటల్ గోల్డ్, మెటల్ స్టాక్స్ కొనుగోలు, ఈటీఎఫ్‌లలో పెట్టుబడులు పెట్టాలి. ఏళ్లకేళ్లు ధనం కూడబెట్టి బంగారం కొని ఇంటిలో దాచిపెట్టుకోవడం వల్ల దేశ ఆర్థిక రంగానికి ఎలాంటి ఉపయోగం లేదు. పైగా ఉన్న విదేశీ మారక ద్రవ్య నిల్వలను మొత్తం బంగారం స్వాహా చేసేస్తోంది. అందుకే అవస్థలు పడుతున్న ఆర్థిక రంగాన్ని నిలబెట్టేందుకు ప్రజల డబ్బును ఆర్థిక వ్యవస్థ బలోపేతం కోసం పెట్టుబడులుగా మార్చేందుకు ప్రధాని మోడీ కొత్త మంత్రదండాన్ని ప్రయోగించారు. అదే బంగారం కొనుగోళ్లను వెంటనే ఆపేయడం. మరి బంగారాన్ని సెంటిమెంట్‌గా భావించే మనదేశ ప్రజలు ప్రధాని మాటను ఆచరిస్తారా పెడచెవిన పెడతారా? అన్నది కాలమే నిర్ణయించుచుంది.

కొసమెరుపేమిటంటే.. విదేశాంగ విధానంలో విఫలం చెందిన మోదీ తమ ప్రభుత్వ తప్పులను, చేతకానితనాన్ని ప్రజల ఇష్టాఇష్టాలతో ముడిపెడుతున్నారని ప్రతిపక్షాలు దుమ్మెత్తి పోస్తున్నాయి. కనీసం ప్రజలు విలాసం కోసం వారివారి సొంత వాహనాలను సైతం వాడొద్దనడం, విదేశీ టూర్లు చేయొద్దనడం, చివరికి ఆభరణాలను సైతం కొనొద్దనడం దుర్మార్గమని మండిపడుతున్నారు. మరి ప్రజలు ప్రధాని మాటను విశ్వసిస్తారా..? ప్రతిపక్షాల విమర్శలను పరిగణనలోకి తీసుకుంటారా..? అన్నది అత్యంత ఆసక్తిని కలిగిస్తోందనడంలో సందేహం లేదు.

ప్రాచీనకాలంలో భారతదేశం బంగారానికి భాండాగారామనే కీర్తి ఉండేది. రత్నాలను రాశులుగా పోసి విక్రయించారనే నానుడి తెలిసిందే. పాహియాన్, మార్కోపోలో వంటి విదేశీ యాత్రికులు తమ పుస్తకాల్లో భారత్ బంగారు గని అని కొనియాడారు. ఆ పుస్తకాలను యూరోపియన్లు చూసే సామ్రాజ్యవాదం పేరుతో భారత్‌ను ఇంగ్లండ్ వంటి దేశాలు ఆక్రమించాయి. అలాంటి చరిత్ర ఉన్న మనదేశంలో బంగారాన్ని ప్రజలు కొనొద్దంటూ దేశ ప్రధానే చెప్పే పరిస్థితి రావడం కాల మహిమ కాకుండా మరేంటని పలువురు వ్యాఖ్యానించడం గమనార్హం...!

## నెల్లూరు 'మహానాడు'..
# చరిత్రాత్మకంగా నిలవాలి



ఎన్టీఆర్ విగ్రహానికి నివాళులర్పిస్తున్న మంత్రులు, టీడీపీ నేతలు

### సన్నాహక సమావేశంలో టీడీపీ నాయకుల సంకల్పం

నెల్లూరులో తొలిసారిగా ఈనెల 27, 28, 29 తేదీలలో నిర్వహించనున్న టీడీపీ మహానాడు చరిత్రాత్మకంగా నిలవాలని, ఆ మహావేదికపై జరిగే మహా సభలు దిగ్విజయం అయ్యేందుకు ప్రతి ఒక్కరం కృషిచేద్దామని తెలుగుదేశం పార్టీ నాయకులు సంకల్పించారు. కొడవలూరు మండలం ఇఫ్కో సెజ్ ప్రాంగణంలో ఈనెల 13న మహానాడు సన్నాహక కమిటీ సమావేశం జరిగింది. రాష్ట్రవ్యాప్తంగా పలువురు ముఖ్య నాయకులు, మంత్రులు తరలివచ్చారు. తొలుత, తెలుగుదేశం పార్టీ వ్యవస్థాపకులు స్వర్గీయ నందమూరి తారకరామారావు విగ్రహానికి నాయకులు పూలమాలలు వేసి నివాళులు అర్పించారు. అనంతరం, మహానాడు ఏర్పాట్లకు సంబంధించి టీడీపీ రాష్ట్రపార్టీ అధ్యక్షులు పల్లా శ్రీనివాసరావు అధ్యక్షతన సన్నాహక సమావేశం జరిగింది. పల్లా శ్రీనివాసరావు, మంత్రి అచ్చెన్నాయుడు టీడీపీ జిల్లా అధ్యక్షుడు బీద రవిచంద్ర నేతృత్వంలో కమిటీ కన్వీనర్లకు మహానాడు ఏర్పాట్ల విషయమై తగు ఆదేశాలు ఇచ్చారు. రాష్ట్ర పురపాలక పట్టణాభివృద్ధి శాఖా మంత్రి డాక్టర్ పొంగూరు నారాయణ మాట్లాడుతూ, ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడు, యువనేత లోకేష్‌లు నెల్లూరుజిల్లాలోని కిసాన్‌సెజ్‌ను మహానాడు వేదికగా నిర్ణయించడం జిల్లాకు దక్కిన గౌరవంగా భావిస్తున్నా మన్నారు. సమావేశంలో మంత్రులు ఎన్ఎండీ ఫరూక్, పొంగూరు నారాయణ, ఆనం రామనారాయణరెడ్డి, బీసీ జనార్దన్ రెడ్డి, అనగాని సత్యప్రసాద్, రాంప్రసాద్ రెడ్డి, ఎంపీ వేమిరెడ్డి ప్రభాకర్‌రెడ్డి, సీఎం ప్రోగ్రామ్ కోఆర్డినేటర్ మంతెన సత్యనారాయణ రాజు, ఎమ్మెల్సీ భూమిరెడ్డి రాంగోపాల్‌రెడ్డి, ఎమ్మెల్యేలు సోమిరెడ్డి చంద్రమోహన్‌రెడ్డి, వేమిరెడ్డి ప్రశాంతిరెడ్డి, కోటంరెడ్డి శ్రీధర్‌రెడ్డి, డీవీ కృష్ణారెడ్డి, కాకర్ల సురేష్, పాశం సునీల్‌కుమార్, కురుగొండ్ల రామకృష్ణ ఇంటూరి నాగేశ్వరరావు, పులివర్తి నాని, టీడీపీ రాష్ట్ర అధికార ప్రతినిధి కోటంరెడ్డి గిరిధర్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.



### ఆనంతో వేమిరెడ్డి దంపతుల భేటీ

నెల్లూరు సంతపేటలోని క్యాంపు కార్యాలయంలో రాష్ట్ర దేవాదాయ శాఖ మంత్రి ఆనం రామనారాయణరెడ్డితో ఇటీవల నెల్లూరు ఎంపీ వేమిరెడ్డి ప్రభాకర్‌రెడ్డి, కోవూరు ఎమ్మెల్యే వేమిరెడ్డి ప్రశాంతిరెడ్డిలు మర్యాదపూర్వకంగా భేటీ అయ్యారు. జిల్లాలో నిర్వహించనున్న మహానాడు ఏర్పాట్లు, జిల్లాలో జరుగుతున్న పలు అభివృద్ధి కార్యక్రమాలపై మంత్రి ఆనంతో సుదీర్ఘంగా చర్చించారు. ఈ సందర్భంగా మంత్రి ఆనం కుమార్తె ఆనం లీలా కైవల్యరెడ్డితో వేమిరెడ్డి దంపతులు ఆప్యాయంగా ముచ్చటించారు.

# రెడ్ క్రాస్ క్యాన్సర్ ఆసుపత్రికి కార్పొరేట్ హంగులు

- అందుబాటులోకి రానున్న నూతన అధునాతన భవనం
- కోటి రూపాయలు విరాళంగా ప్రకటించిన బద్దెవోలు శ్రీహరిరెడ్డి - డాక్టర్ కృష్ణవేణమ్మ దంపతులు



దాతలు బి.శ్రీహరిరెడ్డి - డాక్టర్ కృష్ణవేణమ్మలను సత్కరిస్తున్న రెడ్‌క్రాస్, క్యాన్సర్ ఆసుపత్రి కమిటీ సభ్యులు

ఇండియన్ రెడ్ క్రాస్ సొసైటీ ఆధ్వర్యంలో నడుస్తున్న క్యాన్సర్ ఆసుపత్రికి కార్పొరేట్ హంగులు కల్పించనున్నారు. ఇప్పటివరకూ పేద మధ్య తరగతి కుటుంబాల సేవకే పరిమితమైన క్యాన్సర్ ఆసుపత్రి త్వరలో శ్రీమంతులకి కూడా తన సేవలు అందించబోతోంది. ఈ ప్రణాళికలో భాగంగా మే 13వ తేదీ బుధవారం ఆసుపత్రి ప్రాంగణంలో భూమిపూజ చేసి ఆధునిక వసతులతో నూతనంగా నిర్మించనున్న భవనానికి శంకుస్థాపన చేశారు. నెల్లూరు నగరానికి చెందిన పెద్దలు బద్దెవోలు శ్రీహరిరెడ్డి–డాక్టర్ కృష్ణవేణమ్మ దంపతులు ఈ నూతన భవన నిర్మాణానికి తమవంతు విరాళంగా కోటి రూపాయలని దశల వారీగా అందించనున్నారు.

### ఈ భవనంలో సేవలు విస్తరిస్తాం

**-వాకాటి విజయకుమార్‌రెడ్డి**

ఈ సందర్భంగా ఇండియన్ రెడ్ క్రాస్ సొసైటీ నెల్లూరు జిల్లా ఛైర్మన్ వాకాటి విజయకుమార్‌రెడ్డి మాట్లాడుతూ "ఐఆర్ సీఎస్ క్యాన్సర్ హాస్పిటల్ గత 25 సంవత్సరాలుగా నెల్లూరుజిల్లా మరియు పరిసర ప్రాంతాల వేలాదిమంది రోగులకు నాణ్యమైన క్యాన్సర్ వైద్య సేవలు అందిస్తూ ప్రజల విశ్వాసాన్ని చూరగొందన్నారు. ప్రస్తుతం ఆసుపత్రి సిల్వర్ జూబ్లీ సంవత్సరాన్ని జరుపుకుంటుండటం ఆనందంగా ఉందని, ఈ సందర్భంగా చేపడుతున్న నూతన భవన నిర్మాణం తమ సేవా కార్యక్రమాల్లో మరో ముఖ్యమైన ఘట్టంగా పేర్కొన్నారు. నూతన భవనం ప్రధానంగా ఆసుపత్రికి చికిత్స కోసం దూర ప్రాంతాల నుంచి వచ్చే క్యాన్సర్ రోగులు మరియు వారి సహాయకుల కోసం వసతి సౌకర్యాలు కల్పించే ఉద్దేశంతో నిర్మించబడుతోందని చెప్పారు. మొత్తం 16 అధునాతన గదులు అందుబాటులోకి రానున్న ఈ భవనంలో తమ పెద్దల జ్ఞాపకార్థం వారి పేరుతో ఒక గదిని ఎవరైనా స్పాన్సర్ చేయొచ్చని చెప్పారు. సహృదయం కలిగిన దాతలు ముందుకు రావాలని ఆహ్వానించారు. ఈ భవనం నిర్మాణం పూర్తయిన తర్వాత రోగులకు మరింత సౌకర్యవంతమైన సేవలు అందడంతో పాటు ఆసుపత్రి సేవల విస్తరణకు కూడా దోహదపడనుందని విజయకుమార్‌రెడ్డి తెలిపారు. దాతలు, శ్రేయోభిలాషులు అందిస్తున్న సహకారంతో భవిష్యత్తులో కూడా మరింత విస్తృత స్థాయిలో సేవలు అందిస్తామని ఆయన చెప్పారు.

ఆసుపత్రి ప్రాంగణంలో జరిగిన ఈ కార్యక్రమంలో భవన ప్రధాన దాతలు బి.శ్రీహరిరెడ్డి, డాక్టర్ కృష్ణవేణమ్మ, ఇతర దాతలు, జీవితకాల సభ్యులు, మేనేజింగ్ కమిటీ సభ్యులు, వైద్యులు, కన్సల్టెంట్లు, సిబ్బంది, తదితరులు పాల్గొన్నారు.

# అన్నదానం.. మహా పుణ్యకార్యం

**మంత్రి ఆనం**



అన్నదానం చేస్తున్న మంత్రి ఆనం రామనారాయణరెడ్డి

అన్నదానం ఒక పవిత్రమైన కార్యక్రమమని, మహా పుణ్యకార్యమని దేవాదాయమంత్రి ఆనం రామనారాయణరెడ్డి చెప్పారు. ఇటీవల ఆయన ఆత్మకూరు పట్టణంలోని హనుమాన్ జంక్షన్‌లో ఉన్న శ్రీ అభయ ఆంజనేయస్వామి ఆలయంలో వైభవంగా జరిగిన హనుమజ్జయంతి వేడుకల్లో పాల్గొన్నారు. తన కుటుంబ సభ్యులతో కలిసి స్వామివారికి ప్రత్యేక పూజలు చేశారు. భక్తులకు స్వయంగా అన్నప్రసాద వితరణ చేశారు. అనంతరం ఆయన మాట్లాడుతూ, అన్నదానం చేయడం ఒక మహాభాగ్యమన్నారు. అందుకే, రాష్ట్ర వ్యాప్తంగా తిరుమల నుంచి సింహాచలం వరకు అన్ని ప్రధాన ఆలయాల్లో లక్షలాది భక్తులకు దేవాదాయ శాఖ ఆధ్వర్యంలో అన్నదానం చేస్తున్నామని తెలిపారు.

## ఒక్క ఫోన్ కాల్‌కే..
# రోడ్డు మంజూరైంది

### శ్రీధర్‌రెడ్డికి ఆనం వెంకటరమణారెడ్డి ప్రశంసలు



శ్రీధర్‌రెడ్డిని అభినందిస్తున్న ఏపీ స్టేట్ ఆక్వా కల్చర్ డెవలప్మెంట్ అథారిటీ ఛైర్మన్ ఆనం వెంకటరమణారెడ్డి

నెల్లూరు రూరల్‌లో శరవేగంగా అభివృద్ధి పనులు జరుగుతున్నాయని ఏపీ స్టేట్ ఆక్వా కల్చర్ డెవలప్మెంట్ అథారిటీ ఛైర్మన్ ఆనం వెంకటరమణారెడ్డి ప్రశంసించారు. రూరల్ పరిధిలోని 12వ డివిజన్ సౌత్‌రాజుపాలెంలో పలు అభివృద్ధి పనుల ప్రారంభోత్సవంలో ఆయన నెల్లూరురూరల్ ఎమ్మెల్యే కోటంరెడ్డి శ్రీధర్‌రెడ్డితో కలిసి పాల్గొన్నారు. ఈ సందర్భంగా వెంకటరమణారెడ్డి మాట్లాడుతూ, ఒక్క ఫోన్ చేసి రహదారి కావాలని ఎమ్మెల్యే కోటంరెడ్డికి తాను చెప్పగానే.. మధ్యాహ్నం కల్లా ఈ ప్రాంతానికి ఇంజనీరు వచ్చారని.. పక్కరోజే టెండర్ అయిందని.. మూడో రోజు పనులు ప్రారంభమయ్యాయని తెలిపారు. నెల్లూరురూరల్ ఎమ్మెల్యే కోటంరెడ్డి శ్రీధర్‌రెడ్డి అభివృద్ధి పనులు చేయించడంలో తిరుగులేని వ్యక్తి అని..ఒకే ఒక్క మగాడని ఆయన కొనియాడారు. నెల్లూరు రూరల్‌లో వందల కోట్ల రూపాయలు వ్యయమయ్యే అభివృద్ధి పనులు జరుగుతున్నాయని, పనులను పారదర్శకంగా వేగంగా పూర్తి చేయడంలో కోటంరెడ్డి శ్రీధర్‌రెడ్డిని మించినవారు లేరన్నారు. సౌత్‌రాజుపాలెంలో రహదారి నిర్మాణం కోసం స్థానికులు ఎంతోకాలంగా ప్రయత్నం చేశారని, ఎంతమంది చుట్టూ తిరిగినా పని మాత్రం కాలేదని, తాను ఇటీవల ఒకరోజు నెల్లూరు రూరల్ ఎమ్మెల్యే కోటంరెడ్డి శ్రీధర్‌రెడ్డికి ఆ విషయమై ఫోన్ చేయగానే వెంటనే స్పందించి సమస్యకు పరిష్కారం చూపారన్నారు. తెలుగుదేశం పార్టీలో ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడు, జాతీయ వర్కింగ్ ప్రెసిడెంట్, మంత్రి నారా లోకేష్ తర్వాత అంతటి సామర్థ్యం, అభివృద్ధి పనులను వేగంగా చేయగల సత్తా ఒక్క కోటంరెడ్డికే ఉందని ఆయన ప్రశంసించారు.

# జనగణనకు సహకరించండి

నెల్లూరు నగరంలో జనగణన సర్వే జరుగుతోందని, అందుకు పూర్తిగా సహకరించి, సంబంధించిన వివరాలను సర్వే సిబ్బందికి తెలియజేయాలని కార్పొరేషన్ కమిషనర్ నందన్ నగర ప్రజలకు విజ్ఞప్తి చేశారు. ఈనెల 13న కార్పొరేషన్ కార్యాలయంలో ఆయన సమావేశం నిర్వహించి జనగణన జరుగుతున్న తీరును సమీక్షించారు. ఈనెల 30వ తేదీ వరకు గృహ గణన, జనగణన సర్వేలు జరుగుతాయని, సర్వే పూర్తయిన వెంటనే ఇంటిపై నెంబరు వేస్తారని, అందుకు ఇళ్లలోని వారు అనుమతించాలని కోరారు.

# 20న మెడికల్ షాపుల బంద్

ఆన్‌లైన్ ఫార్మసీల ధోరణికి నిరసనగా మే 20వతేదీ దేశవ్యాప్తంగా మెడికల్ షాపుల బందుకు అఖిల భారత కెమిస్ట్స్ & డ్రగ్గిస్ట్ అసోసియేషన్ (ఏఐసిడి) పిలుపునిచ్చింది. సమ్మెలో భాగంగా సుమారు 12.40లక్షల దుకాణాలు మూతబడనున్నాయి. నిబంధనలకు విరుద్ధంగా, ప్రిస్క్రిప్షన్ లేకుండా మందులు అమ్మడం, భారీ డిస్కౌంట్లతో చిరు వ్యాపారుల పొట్ట కొట్టడాన్ని అసోసియేషన్ తీవ్రంగా వ్యతిరేకిస్తోంది.

లాయర్
మే 15, 2026

# పెరుగుతున్న 'డెంగ్యూ' కేసులు.. పట్టించుకోని నేతలు!

ఎండాకాలం మండుతున్నప్పుడు ఎప్పుడెప్పుడు వాన లొస్తాయా అని ఎదురుచూస్తాం. వానలు భారీగా కురుస్తుంటే, అవి వరదలుగా మారకుండా చూడు దేవుడా అని మొక్కు కుంటూ ఉంటాం. ఇది సహజం. అయితే, ఇప్పుడు ఎండలు భగ్గుమంటూనే ఉన్నా, రుతుపవనాలు త్వరలోనే రానున్నా యనే వాతావరణ సమాచారం కొంతమేరకు ఆశాజనకంగానే ఉన్నా, వాతావరణం చల్లబడి వానలు వస్తే, దానితో పాటు వ్యాధులు కూడా వచ్చినట్లే అనుకోవాల్సి వస్తోంది. జూన్ దాటితే చాలు.. ఇక డెంగ్యూ కాలం వచ్చేసినట్లే, ఆ చల్లని వాతా వరణంలో ఈడిస్ ఈజిప్ట్ అనే రకం 'డెంగ్యూ దోమలు' వీరంగం చేస్తుంటాయి. మురుగుదిబ్బలు ఆవాసంగా చేసు కుని ఈ దోమలు వీరంగం చేస్తుంటాయి. ఇవి కుడితే.. ఆ నొప్పులకు నరకం కనిపిస్తుంది. వొళ్ళు నొప్పులు, కళ్ల నొప్పులు, కీళ్ల నొప్పులు, ఆగని జ్వరం, తగ్గని తలనొప్పి, వాంతులు వికారాలు ఒకటేమిటి అన్ని రకాలుగా ఈ వ్యాధి బాధితు లను పీడిస్తుంటుంది. ఆ బాధ భరించలేనంతగా ఉంటుంది కూడా. గతంతో పోల్చుకుంటే డెంగ్యూ మరణాలు తగ్గుతున్నా, ఈ వ్యాధితో నరకయాతనలు పడేవారే అధికం. రానురాను మనదేశంలో ఈ వ్యాధి ప్రమాదకరంగా మారే సూచనలున్నా యని, భారత్ అప్రమత్తంగా ఉండాలని ఇటీవల ప్రపంచ ఆరోగ్య సంస్థ కూడా హెచ్చరించింది.2026 మే ప్రారంభం నాటికే మనదేశంలో అత్యధిక డెంగ్యూ కేసులు తమిళనాడు, కేరళ, మహారాష్ట్రల్లో నమోదవుతున్నట్లు గణాంకాలు చెప్తున్నాయి. తమిళనాడులో ఇప్పటికే 2800 కేసులు, మహారాష్ట్రలో 786, కేరళలో 600, కర్ణాటకలో 500 కేసుల దాకా వచ్చాయి. కొన్ని ప్రాంతాల్లో ఆసుపత్రులు డెంగ్యూ బాధితులతో నిండిపోతున్నాయి. వాతావరణ మార్పులు, అపరిశుభ్ర వాతావరణం, పట్టణీకరణ వంటి పరిస్థితుల ప్రభావంతో డెంగ్యూ దోమలు దేశమంతా కుప్పలుతెప్పలుగా పెరిగిపోతూనే ఉన్నాయి కానీ, మన నేతలకి చిన్న దోమ కుట్టినట్లుగా కూడా ఉండడం లేదు. భారీస్థాయిలో వైద్యారోగ్య వ్యవస్థలు మనకున్నా, అంటువ్యాధులు, వైరస్ జబ్బులు, విషవ్యాధులు వంటివి పెరగడమే తప్ప తరగడమే లేదు. అందులోనూ ఇటీవలికాలంలో మన తెలుగు రాష్ట్రాల్లో డెంగ్యూ చాపకింద నీరులా విజృంభిస్తోంది.

వాస్తవానికి డెంగ్యూ.. ఒకరకమైన వైరస్ వ్యాధి. ఇవి పగటి దోమలు, ఉదయం-సాయంత్రం వేళల్లో కుడుతుంటాయి. ఈ దోమలు కుట్టిన వారం పదిరోజుల తర్వాత వాటి ప్రభావం ప్రారంభమవుతుంది. అయితే, చాలా కేసుల్లో ఈ వ్యాధి తగ్గిపోతుంది. కానీ, నిర్లక్ష్యం చేసి తలదాకా తెచ్చుకుంటే మాత్రం.. మునిగిపోవడం తథ్యమంటున్నారు నిపుణులు. వ్యాధి ముదిరితే, రక్తం చిక్కబడడంతో మరింత గందరగోళ పరిస్థితి ఏర్పడుతుంది. ఊపిరితిత్తుల్లోకి ప్లాస్మా ద్రవం వెళ్లి ప్రమాదకరంగా పరిణమిస్తుంటుంది. దగ్గు ఆయాసంతో, తగ్గని జ్వరంతో డెంగ్యూ బాధితులు అల్లాడాల్సి వస్తుంది. రక్తంలో ప్లేట్‌లెట్‌ల సంఖ్య పడిపోయి, ఒక్కోసారి ఆందోళన కర పరిస్థితులకు దారి తీస్తుంది. అయినా, భయపడాల్సిన అవసరం లేదు. నేడున్న అత్యాధునిక వైద్యంతో, వైద్యుల పర్యవేక్షణతో ఇలాంటి ప్రమాదాలనుంచి బయటపడవచ్చని వైద్యులు భరోసా ఇస్తున్నారు. డెంగ్యూ రహిత భవిష్యత్తు కోసం ఏకం కావాలంటూ ఈ ఏడాది 'మే 16న జాతీయ డెంగ్యూ దినోత్సవం' కూడా జరుపుకోబోతున్నాం. కనుక, ఇప్పటినుంచే డెంగ్యూవ్యాధిపట్ల అందరూ అవగాహనతోను, అప్రమత్త తోనూ ఉండాలి. త్వరలోనే వానాకాలం కూడా ప్రారంభ మవుతుంది కనుక, ప్రభుత్వాలు మేల్కొని డెంగ్యూ నివా రణకు ఇకనైనా పెద్దఎత్తున చర్యలు చేపట్టాలి. దోమల నిర్మూ లనకు కార్యాచరణ పథకాలు వెంటనే అమలుచేయాలి. దోమల నివారణకు క్రమబద్ధంగా ఫాగింగ్ జరపాలి. ఎక్కడా అపరిశుభ్రత లేకుండా అన్ని ప్రాంతాల్లోనూ అధికారులు గట్టిచర్యలు తీసుకోవాలి. ప్రజలు, స్వచ్ఛందసంస్థలు అందుకు సహకరించాలి. అంతేకాదు, బహిరంగంగా ఉండే నీటితొట్లు, పాత్రల్లో నీటిని నిల్వ చేయవద్దని, నీళ్ళట్యాంకులు, బక్కెట్లపై మూతపెట్టి ఉంచాలని, పాత టైర్లు, కొబ్బరిచిప్పల వంటివి దోమలకు నిలయాలుగా మారకుండా, వాటిని వెంటనే తొల గించుకోవాలని, దోమలు కుట్టకుండా దోమతెరలు వాడు కోవడం శ్రేయస్కరమని వైద్యనిపుణులు చెప్తున్నారు. వ్యాధి వచ్చాక బాధలుపడేదానికంటే.. వ్యాధి రాకుండా జాగ్రత్తలు పాటించడం మంచిది కదా! వైద్య నిపుణుల సూచనలు పాటిస్తూ, దోమల బారిన పడకుండా ఎవరికి వారు ముందస్తు జాగ్రత్తలు తీసుకోవడం వల్ల డెంగ్యూకి మనం దూరంగా ఉండవచ్చు.

**(మే 16-జాతీయ డెంగ్యూ దినోత్సవం)**

# కనుమరుగవుతున్న కాంగ్రెస్..!




ఇటీవలే కేంద్రపాలిత ప్రాంతం పుదు చ్చేరితో పాటు వెస్ట్ బెంగాల్, తమిళనాడు, అస్సాం, కేరళం రాష్ట్రాలలో ఎన్నికలు జరిగి ఫలితాలు కూడా వచ్చాయి. ఆ అందులో 3 చోట్ల బీజేపీ ఆధ్వర్యంలో కొత్త ప్రభుత్వాలు ఏర్పడ్డాయి. ఇప్పుడిప్పుడే, ఆయా రాష్ట్రాలకు కొత్తగా ముఖ్యమంత్రులు ప్రమాణస్వీకారం చేస్తున్నారు. చిత్రంగా బీజేపీ అధికారం చేజిక్కించుకున్న 3 రాష్ట్రాల ముఖ్యమంత్రులను తీసుకుంటే, వెస్ట్ బెంగాల్ సీఎం సువేందు అధికారి, అస్సాం సీఎం హిమంతబిశ్వ శర్మ, పుదుచ్చేరి సీఎం రంగస్వామి ముగ్గురూ కాంగ్రెస్ డిఎన్ఏ కలిగినవారే. ఇది బీజేపీ వారి సమర్థతో లేక అహంకారంతో కూడిన కాంగ్రెస్‌పార్టీ అసమర్థతో అర్థం కాదు. రోజు రోజుకి క్షీణించిపోతున్న 140 ఏళ్ల చరిత్ర ఉన్న కాంగ్రెస్‌పార్టీ అదృష్టం వల్ల, ఈ ఎన్నికల్లో గెలిచిన ఒక్క రాష్ట్రం కేరళలో కూడా అధికారంలోకి వచ్చి దాదాపు పది రోజులైనా ఇంకా ముఖ్యమంత్రిని నిర్ణయిం చలేని అసహాయ స్థితిలో ఉంది కాంగ్రెస్. ఒంటరిగా బీజేపీని ఎదుర్కోలేక 'ఇండియా' కూటమికి ఊపిరిపోసింది కాంగ్రెస్ పార్టీయే. బీజేపీకి వ్యతిరేకంగా మన మంతా కలసి ఉండాలని ఇతర పార్టీలని ఉసికొల్పేదీ కాంగ్రెస్సే. దురదృష్టవశాత్తు ఢిల్లీ, పంజాబ్‌లలో ఆప్‌తో దోస్తీ చేస్తుంది. బీహార్‌లో అత్యాశతో 70 సీట్లు కావాలని ఆర్‌జేడీని బెదిరించి, చివరకు అక్కడ బీజేపీ గెలిచేట్లు చేసింది. తాజాగా, వెస్ట్ బెంగాల్‌లో 294 సీట్లకు పోటీచేసి ఓట్లు చీల్చి, అక్కడ బీజేపీ విజయానికి పరోక్షంగా సహకరించింది. అక్కడ కాంగ్రెస్‌కి 2 సీట్లు మాత్రమే వచ్చాయి. అలాగే, ఆంధ్రప్రదేశ్‌లో పీసీసీ అధ్యక్షురాలుగా షర్మిలను పెట్టి, తమకు బద్ధశత్రువు లాంటి ఎన్డీఏ ప్రభుత్వాన్ని కాకుండా, ప్రస్తుతం ప్రతిపక్షంలో ఉన్న వైఎస్ జగన్మోహన్‌రెడ్డిని అనుక్షణం విమర్శింపజేయడం కూడా కాంగ్రెస్‌పార్టీ వింత పోకడకి తార్కాణమే. ఇప్పటికే దేశంలోని అనేక రాష్ట్రాలలో కాంగ్రెస్ తుడిచిపెట్టుకు పోయింది. పరిస్థితి ఇలాగే కొనసాగితే ఇక కాంగ్రెస్ కనుమరుగే...!

*యం. చంద్రమౌళి*, **కొత్త ఢిల్లీ.**

# వివాదాలకి వేదికగా టీటీడీ!

అతి పవిత్రమైన ప్రపంచ ప్రఖ్యాత పుణ్యక్షేత్రం తిరుమల తిరుపతి దేవస్థానం ఇటీవల వివాదాలకు వేదికగా మారిపోయింది. రాష్ట్రంలో ఏ పార్టీ అధికారంలో ఉంటే ఆ పార్టీ టీటీడీని రాజకీయాలకి వేదికగా మార్చడంతో ఈ పరిస్థితి దాపురించింది. తమకి కొమ్ము కాసే మీడియా అధిపతులకు, తమ అడుగులకి మడుగులొత్తే పార్టీ శ్రేణులకు పాలకమండలి ఛైర్మన్లుగా, సభ్యులుగా పదవులు కట్టబెట్టి టీటీడీ వ్యవస్థని రాజకీయపార్టీలు భ్రష్టు పట్టిస్తున్నాయి. ఇప్పటికే నెయ్యి వివాదంతో ఆలయ ప్రతిష్టని దిగజార్చారు. తాజాగా శ్రీవాణి టికెట్ల మంజూరు విషయంలో అసంబద్ధ నిర్ణయం తీసుకుని భక్తులను ఇబ్బందుల పాలు చేస్తున్నారు. దాతల విషయంలో సైతం గాడిదని గుర్రాన్ని ఒకే గాటిన కట్టేసినట్లుగా వ్యవహరిస్తున్నారు. స్వామివారికి కానుకగా కోటి రూపాయలు ఇచ్చిన వారికీ, లక్ష రూపాయలు ఇచ్చిన వారికీ ఒకే విధమైన దర్శనం కల్పిస్తూ విమర్శలు ఎదుర్కొంటున్నారు. అత్యున్నత న్యాయస్థానాలు జోక్యం చేసుకుని టీటీడీ లాంటి పుణ్యక్షేత్రాలలో ఈ రాజకీయపార్టీల జోక్యం లేకుండా ఆదేశాలు ఇస్తే తప్ప పరిస్థితులు చక్కబడేలా లేవు..!

*- లక్ష్మీభరద్వాజ్*, **హైదరాబాదు.**

# ఆన్‌లైన్ బోధనతో దేశానికి నష్టం

మనసులో మాట 97

ఇరాన్-అమెరికా ఉద్రిక్తతల నేపథ్యంలో ఇంధన పొదుపు కోసం, విదేశీ మారకద్రవ్య నిల్వలను ఆదా చేయడం, పెంచుకోవడం కోసం ప్రధాని నరేంద్రమోదీ ఇటీవల పలు సూచనలు చేశారు. అందులో విద్యారంగానికి సంబంధించి చేసిన సూచన ఒకటి. దేశ ఆర్థిక భద్రత దృష్ట్యా ఆ సూచనలన్నీ సమర్థించదగినవే. అయితే పాఠశాలలు, కళాశాలలు ఆన్‌లైన్ బోధనలను పరిశీలించాలని చేసిన సూచన మాత్రం ఆందోళన కలిగించే విధంగా ఉంది. ఇంధనాన్ని ఆదా చేయడం ఎంత ముఖ్యమో, రేపటి పౌరుల మేధో వికాసానికి పునాదులు వేసుకోవడం కూడా అంతే ముఖ్యం.

కొవిడ్ సమయంలో ఆన్‌లైన్ విద్య వల్ల జరిగిన నష్టం ఇప్పటికీ వెంటాడుతూనే ఉంది. ఈ నష్టం ఎలా ఉందో తల్లిదండ్రులకు, విద్యావేత్తలకు బాగా తెలుసు. ఆన్‌లైన్ బోధన వల్ల పిల్లల్లో చదవడం, రాయడం, ప్రాథమికమైన గణన- అంటే తేలికపాటి కూడికలు, తీసివేతల వంటి కనీస నైపుణ్యాలు 30–40% తగ్గాయని కోవిడ్ అనంతర సర్వేలు వెల్లడించాయి.

జాతీయ విద్యా విధానం (NEP 2020) ప్రకారం, నర్సరీ నుండి రెండో తరగతి వరకు ఉండే ఐదేళ్ల కాలాన్ని 'ఫౌండేషన్ స్టేజ్'గా పరిగణిస్తారు. ఈ వయస్సులో పిల్లల మెదడు అభివృద్ధి 85% పూర్తవుతుంది. ఈ దశలో ప్రత్యక్ష బోధన తప్పనిసరి. విద్యార్థి దశలో తొలి ఐదు సంవత్సరాలు 'లెర్నింగ్ టు రీడ్' (చదవడానికి నేర్చుకోవడం) దశ. ఆ తర్వాతే 'రీడింగ్ టు లెర్న్'. ఒక విద్యార్థి పూర్వ ప్రాథమిక, ప్రాథమిక దశలో అంటే అక్షర క్రమాన్ని, వాక్య నిర్మాణాన్ని సరిగ్గా పట్టుకోలేకపోతే, ఆ లోటు జీవితాంతం వెంటాడుతుంది. ఆన్‌లైన్ క్లాసుల్లో ఉపాధ్యాయుడు పక్కన ఉండి దిద్దించే అవకాశం లేకపోవడం వల్ల పిల్లల్లో 'గ్రాఫిక్ మెమరీ' (అక్షరాన్ని గుర్తించే శక్తి) బలహీనపడుతుంది. ఈ వయస్సులో కోల్పోయిన నైపుణ్యాన్ని తర్వాత ఎన్ని ట్యూషన్లు పెట్టినా భర్తీ చేయడం అసాధ్యం.

పేద మరియు దిగువ మధ్యతరగతి కుటుంబాలలో కంప్యూటర్లు ఉండటం అరుదు. స్మార్ట్‌ఫోన్ ఉన్నప్పటికీ, ఇంట్లో ఇద్దరు ముగ్గురు పిల్లలు ఉంటే అందరికీ డేటా కనెక్టివిటీ, పరికరాలు అందించడం భారంగా మారుతుంది. ఏ వర్గానికి చెందిన వారైనా ఇప్పుడు తల్లిదండ్రులు ఇద్దరూ ఉద్యోగాలకో, రోజువారీ పనులకో వెళ్తున్నారు. ఆన్‌లైన్ క్లాసుల సమయంలో పిల్లల పక్కన కూర్చునే సమయం వారికి ఉండదు. పర్యవేక్షణ లేని పిల్లలు గంటల తరబడి స్క్రీన్ల ముందు కూర్చుని అనవసరమైన వెబ్‌సైట్లు చూడటం లేదా గేమింగ్‌కు బానిసలయ్యే ప్రమాదం ఉంది. ఇక పూర్వ ప్రాథమిక విద్యకు అయితే కచ్చితంగా పిల్లలు.. ఉపాధ్యాయులు, లేదా తల్లిదండ్రుల పర్యవేక్షణలో ఉండాల్సిందే. లేదంటే వారు నేర్చుకోవడం అనేది అసాధ్యం.

ఆన్‌లైన్ బోధన వల్ల పిల్లల 'అటెన్షన్ స్పాన్' (ఏకాగ్రత నిలిపే సమయం) గణనీయంగా పడిపోతుంది. పిల్లల మెదడు 'హైపర్-స్టిమ్యులేషన్'కు అలవాటు పడుతుంది. దీనివల్ల సాధారణ పుస్తక పఠనం వారికి విసుగు పుట్టిస్తుంది. ఒక్కసారి డిజిటల్‌కు అలవాటు పడిన మెదడును తిరిగి పాత ఏకాగ్రత స్థితికి తీసుకురావడం అసాధ్యమైన పని. ఇది భవిష్యత్తులో విశ్లేషణాత్మక నైపుణ్యాలు అవసరమయ్యే రంగాల్లో మన యువతను వెనకబడేలా చేస్తుంది. స్క్రీన్ల వెనుక బందీలైన పిల్లలకు సానుభూతి, సహనం, ఓటమిని తట్టుకోవడం వంటి లక్షణాలు అలవడవు. సామాజిక శాస్త్రవేత్తల ప్రకారం, ఈ వయస్సులో కోల్పోయిన సామాజిక నైపుణ్యాలు జీవితాంతం వారి వ్యక్తిత్వంపై ప్రతికూల ప్రభావం చూపుతాయి. ఆన్‌లైన్ విద్య వల్ల సమాజం నుండి విడదీయబడిన ఒక "ఏకాకి తరం" తయారయ్యే ప్రమాదం ఉంది. ప్రాథమిక విద్యలో 40% నైపుణ్యం కోల్పోయిన విద్యార్థి, భవిష్యత్తులో అంతర్జాతీయ ప్రమాణాలతో కూడిన పరిశోధనలు చేయలేడు. ఇది కేవలం వ్యక్తిగత నష్టం కాదు, దేశం యొక్క 'ఇన్నోవేషన్ ఇండెక్స్' పడిపోవడానికి కారణమవుతుంది.

భారతదేశం 'విశ్వగురువు'గా ఎదగాలని, అంతర్జాతీయ స్థాయిలో అగ్రగామిగా ఉండాలని లక్ష్యంగా పెట్టుకుంది. ప్రతిభావంతులైన ఇంజనీర్లు, సైంటిస్టులు, డాక్టర్లు తయారుకావాలంటే వారి ప్రాథమిక విద్య పటిష్ఠంగా ఉండాలి. విద్యార్థులను మళ్లీ ఆన్‌లైన్ విద్యకు మళ్లిస్తే రాబోయే 10–15ఏళ్లలో మన యువతరం అంతర్జాతీయ పోటీలో వెనకబడిపోతుంది. ఇది దేశ ప్రగతికి గొడ్డలి పెట్టు.

ఇంధన సంక్షోభం అనేది దేశానికి వచ్చిన ఒక భౌతిక సమస్య. ఇందుకోసం కొన్ని ప్రత్యామ్నాయాలను పరిశీలించవచ్చు. కనీసం ఫౌండేషన్ స్కూల్ (నర్సరీ నుండి 2వ తరగతి వరకు) పిల్లలకు కచ్చితంగా ప్రత్యక్ష బోధన ఉండాలి. పెద్ద తరగతుల విద్యార్థులకు (9 నుండి 12 వరకు) వారంలో రెండు మూడు రోజులు ఆన్‌లైన్ క్లాసులు నిర్వహించవచ్చు. ప్రధాన మార్గాల్లో ఉండే విద్యాసంస్థలకు చెందిన పిల్లలను విధిగా ప్రజా రవాణా వాడేలా నిబంధనలు తీసుకురావచ్చు. విద్యాసంస్థల సమయాలను మార్చడం ద్వారా ట్రాఫిక్ రద్దీని తగ్గించి, ఇంధన వృథాను అరికట్టవచ్చు. పిల్లలు తమ ఇంటికి దగ్గరగా ఉన్న బడుల్లో చేరేలా ప్రోత్సహించడం ద్వారా ప్రయాణ దూరాన్ని తగ్గించవచ్చు.



ఒక తరం విద్యార్థుల పునాదిని బలహీనం చేయడం అంటే, దేశం యొక్క భవిష్యత్తును బలహీనపర్చుకోవడమే. ఇంధన భద్రతను, విద్యా భద్రతను ఒకే త్రాసులో వేసి చూడకూడదు. విద్య అనేది రాజీ పడలేని అత్యవసర సేవ. దానికి ప్రత్యక్ష బోధన ఒక్కటే ఏకైక మార్గం.

**- తుమ్మల బాల గంగాధర్ తిలక్**

# నేదురుమల్లి సేవలు చిరస్మరణీయం

## వర్ధంతి కార్యక్రమాల్లో రామ్‌కుమార్‌రెడ్డి



తమ తండ్రి, దివంగత నేత, ఉమ్మడి ఆంధ్రప్రదేశ్ మాజీ ముఖ్యమంత్రి నేదురుమల్లి జనార్దన్‌రెడ్డి రాష్ట్రానికి, జిల్లా ప్రజలకు చేసిన సేవలు చిరస్మరణీయమని ఆయన తనయుడు, ఎన్‌బికేఆర్ ఇంజనీరింగ్ కళాశాల కరస్పాండెంట్, వెంకటగిరి నియోజకవర్గ వైసీపీ నాయకుడు నేదురుమల్లి రామ్‌కుమార్‌రెడ్డి చెప్పారు. జనార్దన్‌రెడ్డి 12వ వర్ధంతి సందర్భంగా స్వర్ణముఖి బ్యారేజ్ ప్రాంగణంలో ఉన్న స్వర్గీయ నేదురుమల్లి జనార్ధన్‌రెడ్డి విగ్రహానికి ఆయన పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా తమ తండ్రి సేవలను ఆయన గుర్తుచేసుకున్నారు. వాకాడు, కోట, చిట్టమూరు మండలాలకు చెందిన అనేకమంది నాయకులు, కార్యకర్తలు, వివిధ ప్రాంతాల నుండి వచ్చిన నేదురుమల్లి అభిమానులతో కలిసి పెద్దాయన విగ్రహానికి పూలమాలవేసి వారిని స్మరించుకున్నారు.

### నేదురుమల్లి నివాసంలో..

అదేవిధంగా, వాకాడులోని నేదురుమల్లి నివాసంలో జరిగిన కార్యక్రమంలో నేదురుమల్లి జనార్ధనరెడ్డి చిత్రపటానికి రామ్‌కుమార్‌రెడ్డి పూలమాలలు వేసి నివాళు లర్పించారు. జిల్లావ్యాప్తంగా వివిధ ప్రాంతాల నుండి వచ్చిన నేదురుమల్లి అభిమానులు జనార్దన్‌రెడ్డి చిత్రపటానికి పూలమాలలు సమర్పించి, రాష్ట్ర ప్రజల కోసం ఆయన చేసిన అభివృద్ధి, సేవా కార్యాక్రమాలను జ్ఞాపకం చేసుకున్నారు.

### ఎన్‌బికేఆర్ ఐఎస్టీలో..

కోట మండలం విద్యానగర్‌లోని ఎన్‌బికేఆర్ ఐఎస్టీలో మాజీ ముఖ్యమంత్రి నేదురుమల్లి జనార్దన్‌రెడ్డి చిత్రపటానికి కళాశాల ప్రిన్సిపాల్ డా. శ్రీనివాసులు పూలమాలలు వేసి నివాళులర్పించారు. రాజకీయరంగంలో ఎన్నో ఉన్నతశిఖరాలను ఆయన అందుకున్నారని కొనియాడారు. ఎమ్మెల్సీగా, ఎమ్మెల్యేగా, మంత్రిగా, ముఖ్యమంత్రిగా కూడా పదవి నధిష్టించి, రాష్ట్ర జాతీయస్థాయిలో ఆయన ప్రఖ్యాతి చెందారన్నారు. వారు ఇప్పుడు మనమధ్య భౌతికంగా లేకున్నా, మనందరి మనసుల్లో ఆయన శాశ్వత స్థానం పొందారని అభినందించారు. తండ్రి నేదురుమల్లి ఆశయాలను ఆయన తనయుడు నేదురుమల్లి రామ్‌కుమార్‌రెడ్డి నెరవేరుస్తున్నారని సంతోషం వ్యక్తం చేశారు. ఈ కార్యక్రమంలో ఎన్‌బికేఆర్ హెచ్ఓడీలు డా.చింతా రవీంద్రరెడ్డి, నాగిరెడ్డి శ్రీహరిరెడ్డి, హరినాథ్‌రెడ్డి, సుబ్బారెడ్డి, సురేష్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

# 'ఇందుపూరు' అభివృద్ధికి పూర్తిగా సహకరిస్తా!

## • నెల్లూరు ఎంపీ వేమిరెడ్డి ప్రభాకర్‌రెడ్డి



శ్రీ ప్రసన్న వెంకటేశ్వరస్వామి దేవస్థాన పునర్నిర్మాణానికి శంకుస్థాపన చేస్తున్న ఎంపీ వేమిరెడ్డి, ఎమ్మెల్యే కృష్ణారెడ్డి, ఎమ్మెల్సీ బీద రవిచంద్ర తదితరులు.

తమ సొంత ఊరైన ఇందుపూరు గ్రామం అభివృద్ధికి పూర్తి సహకారం అందిస్తానని నెల్లూరు ఎంపీ వేమిరెడ్డి ప్రభాకర్‌రెడ్డి చెప్పారు. ఈనెల 9న ఆయన ఆ గ్రామాన్ని ఎమ్మెల్సీ బీద రవిచంద్ర, ఎమ్మెల్యే డీవీ కృష్ణారెడ్డి, శ్రీశైల దేవస్థానం ప్రత్యేక ఆహ్వానితులు, తన సోదరులైన వేమిరెడ్డి కోటారెడ్డిలతో కలిసి సందర్శించారు. శ్రీ ప్రసన్న వెంకటేశ్వరస్వామి దేవస్థానం పునర్నిర్మాణానికి ఆయన శంకుస్థాపన చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, ఈ దేవస్థానం పునర్నిర్మాణ శంకుస్థాపనలో పాల్గొనడం తన పూర్వ జన్మ సుకృతమన్నారు. పురాతనమైన ఈ దేవాలయ పునర్నిర్మాణం కోసం ఇందుపూరు గ్రామంలో ప్రజలందరూ, కలిసికట్టుగా ముందుకు రావడం హర్ష దాయకమన్నారు. 1 కోటి 45 లక్షల రూపాయల అంచనాతో నిర్మిస్తున్న ఈ దేవస్థానానికి దేవాదాయ శాఖ వారు కామన్ గుడ్ ఫండ్ కింద రూ.96 లక్షల 67 వేలు మంజూరు చేయగా, ప్రజల తరఫున రూ.48లక్షల 33వేల విరాళాలు సమకూరడం విశేషమన్నారు. అదేవిధంగా ఇందుపూరు దళితవాడల్లో పోలేరమ్మ అమ్మవారి గుడి నిర్మాణం కోసం మరో 10 లక్షల రూపాయలు, నెల్లూరులోని కోదండరామస్వామి వారి దేవస్థానం నిర్మాణం కోసం 10 లక్షల రూపాయలు టీటీటీ శ్రీవాణి ట్రస్ట్ నుండి నిధుల మంజూరుకు కృషి చేస్తున్నామని తెలిపారు.

# పేదలపాలిట కల్పతరువు..సీఎం సహాయనిధి

## • ఉదయగిరి ఎమ్మెల్యే కాకర్ల సురేష్



సీఎంఆర్ఎఫ్ చెక్కును పంపిణీ చేస్తున్న ఎమ్మెల్యే కాకర్ల, ఎమ్మెల్సీ శ్రీకాంత్

ముఖ్యమంత్రి సహాయనిధి పేదలపాలిట కల్పతరువుగా సహాయపడుతోందని ఉదయగిరి ఎమ్మెల్యే కాకర్ల సురేష్ చెప్పారు. ఈనెల 10న ఆయన వింజమూరులోని తన క్యాంపు కార్యాలయంలో ఎమ్మెల్సీ కంచర్ల శ్రీకాంత్‌తో కలిసి 69 మంది లబ్దిదారులకు సుమారు 50 లక్షల రూపాయల సీఎంఆర్ఎఫ్ చెక్కులను పంపిణీ చేశారు. కూటమి ప్రభుత్వం ఏర్పడిన అనంతరం ఉదయగిరి నియోజకవర్గంలో 859 మంది లబ్ధిదారులకు 8కోట్ల 15 లక్షల రూపాయలను సీఎం సహాయనిధి కింద అందజేశారని, రాష్ట్ర ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడు పేదల సంక్షేమం పట్ల, ఆరోగ్యం పట్ల ఎంతో శ్రద్ధ చూపుతూ ఈ పథకం కింద నిధులను అందజేస్తున్నారని ఆయన సంతోషం వ్యక్తం చేశారు. అనంతరం, వెలుగు విభాగానికి చెందిన వివోఏలకు 15 వేల రూపాయల విలువజేసే స్మార్ట్ ఫోన్‌లను పంపిణీ చేశారు. సీఎం సహాయనిధి ద్వారా చెక్కులు అందుకున్న బాధితులు తమ సంతోషాన్ని వ్యక్త పరుస్తూ, ఎమ్మెల్యేకు, కూటమి ప్రభుత్వానికి కృతజ్ఞతలు తెలిపారు.

# అంజన్న సేవలో ఆల్తూరు మహేష్‌రెడ్డి కుటుంబం

## • ఆంజనేయస్వామికి రెండున్నర కోట్లతో పసిడి వెలుగులు



**సేవా భావానికి, ఆధ్యాత్మిక తత్పరతకి ప్రాంతీయ భేదాలు, హద్దులు ఉండవని రుజువు చేస్తోంది ఆల్తూరు మహేష్‌రెడ్డి కుటుంబం. ఇప్పటికే మహారాష్ట్రలోని షిరిడిలో భూరి విరాళాలతో సాయిబాబా సేవలో తరిస్తున్న ప్రముఖ వ్యాపారవేత్త, సినీ నిర్మాత, అన్నిటికి మించి మన నెల్లూరీయుడు ఆల్తూరు మహేష్‌రెడ్డి తాజాగా కర్ణాటకలో మరో ఆధ్యాత్మిక కార్యక్రమంతో ఆంజనేయస్వామి వారిని స్వర్ణ వెలుగులతో ప్రకాశింపజేశారు.**





కర్ణాటకలోని చారిత్రాత్మక హంపి సమీపంలో, పురాణ కాలంలో కిష్కింధగా ప్రసిద్ధి చెందిన పురాతన అంజనాద్రి బెట్ట పుణ్యక్షేత్రంలో అంజన్నకి (ఆంజనేయ స్వామి)కి రెండున్నర కోట్ల రూపాయల విలువ చేసే బంగారు ఆభరణాలని అందజేశారు. పసిడితో చేసిన మకర తోరణంతో పాటు, కిరీటం, గధ, ఛత్రంలని స్వామి వారికి సమర్పించి అలంకరింపజేశారు. అతి క్లిష్టమైన మెట్ల దారిలో మహేష్‌రెడ్డి –రాధిక దంపతులతో పాటు వారి కుటుంబ సభ్యులు కూడా స్వామి చెంతకు చేరుకొని పూజాకార్యక్రమాలు నిర్వహించారు. సుమారు 575 మెట్లు కలిగిన ఈ పర్వత శిఖరాగ్రాన శిలలో చెక్కబడిన ఆంజనేయ స్వామి విగ్రహంతో పాటు శ్రీరామ, సీత మరియు అంజనాదేవి మందిరాలని భక్తులు దర్శించుకుంటుంటారు. చుట్టూ ఉన్న సుందరమైన ప్రకృతి దృశ్యాలు, సమీపంలోని రాతి రథం, యంత్ర హనుమాన్ ఆలయం వంటి చారిత్రక కట్టడాలు ఇక్కడ ప్రత్యేక ఆకర్షణలు. ప్రకృతి ఒడిలో, సుందరమైన దృశ్యాల మధ్య వెలసిన ఈ అంజనాద్రి క్షేత్రం ఇప్పుడు ఆల్తూరు మహేష్‌రెడ్డి కుటుంబం సమర్పించిన స్వర్ణాభరణాల కాంతితో మరింత శోభాయమానంగా మారింది. మే 8వతేదీ శుక్రవారం నాడు జరిగిన ఈ కార్యక్రమంలో కర్ణాటక ఎమ్మెల్యే గాలి జనార్దన్‌రెడ్డి–శ్రీమతి లక్ష్మీఅరుణ దంపతులు కూడా పాల్గొన్నారు.

### అమ్మా.. నాన్నల స్ఫూర్తితో..!

రాష్ట్రంలోని శ్రీశైల ఆలయంతో పాటు నెల్లూరులోని మూలస్థానేశ్వర దేవస్థానం, శ్రీ రాజరాజేశ్వరి అమ్మవారి గుడి, జిల్లాలోని రామతీర్థం, మైపాడు సముద్రతీరంలలో అనేక ఆధ్యాత్మిక కార్యక్రమాలకి శ్రీకారం చుట్టిన తమ అమ్మా... నాన్నలు ఆల్తూరు ఆదినారాయణరెడ్డి(లేట్) – శ్రీమతి సులోచనమ్మల స్ఫూర్తితో ఆల్తూరు మహేష్‌రెడ్డి ఆధ్యాత్మిక సేవలో తరిస్తున్నారు. ఓ వైపు వ్యాపార రంగంలో తనదైన ముద్ర వేసుకుంటూనే మరోవైపు భక్తి తత్పరతని ప్రదర్శిస్తున్నారు. సినిమా రంగంలో అడుగుపెట్టి అక్కడ సైతం భక్తి సినిమాలకే ప్రాధాన్యత ఇచ్చారు. "షిరిడి సాయి" పేరుతో బాబా చరిత్రని, "ఓం నమో వెంకటేశాయ" పేరుతో హాథీరామ్ బావాజీ జీవిత కథని వెండితెరపై చిత్రీకరించి ప్రేక్షకులకి అందించారు మహేష్‌రెడ్డి. కేవలం తమ స్వంత జిల్లా నెల్లూరుకే పరిమితం కాకుండా, దేశంలో ఎక్కడ అవసరమైతే అక్కడ ఆధ్యాత్మిక కార్యక్రమాల కోసం తమవంతు సేవలు అందిస్తూ, భక్తి మార్గంలో తరిస్తూ తమ జీవితాలను ధన్యం చేసుకుంటున్న పుణ్యదంపతులు ఆల్తూరు మహేష్‌రెడ్డి – రాధికలకి అభినందనలు.

# నెల్లూరు కబుర్లు

## కలెక్టర్ హిమాన్షు చొరవతో..రికార్డుస్థాయిలో
# 110 మందికి.. ఉద్యోగోన్నతులు



ఉద్యోగోన్నతులు పొందిన వీఆర్‌ఓలతో జిల్లా కలెక్టర్ హిమాన్షు శుక్ల

ప్రభుత్వ ఉద్యోగులు ప్రజలకు మంచి ఆలోచనతో విధులు నిర్వహించాలని ఆకాంక్షిస్తూ జిల్లా కలెక్టర్ హిమాన్షు శుక్లా ఇటీవల రికార్డుస్థాయిలో 110 మంది సచివాలయాల వీఆర్‌ఓలకు గ్రేడ్-2 నుంచి గ్రేడ్-1 వీఆర్‌ఓలుగా ఉద్యోగోన్నతులు కల్పించడం విశేషం. ఈ సందర్భంగా మంగళవారం నెల్లూరు కలెక్టరేట్‌లోని తిక్కన ప్రాంగణంలో జిల్లావ్యాప్తంగా వచ్చిన ఆ వీఆర్‌ఓలకు కలెక్టర్ హిమాన్షు శుక్ల, జాయింట్ కలెక్టర్ మొగిలి వెంకటేశ్వర్లు, డీఆర్‌ఓ విజయకుమార్‌లు నియామక ఉత్తర్వులు అందజేశారు. ప్రజా సమస్యల పరిష్కారమే ఉద్యోగుల ప్రధాన బాధ్యతగా ఉండాలని, విధులను క్రమశిక్షణతో నిర్వహిస్తూ ప్రజల విశ్వాసాన్ని నిలబెట్టుకోవాలని కలెక్టర్ పిలుపునిచ్చారు. ఈ సందర్భంగా తమకు ఉద్యోగోన్నతులు కల్పించిన కలెక్టర్ తదితర అధికారులకు వీఆర్‌ఓలు ధన్యవాదాలు తెలిపారు.

# వనజకుమారికి.. రాష్ట్రస్థాయి అవార్డు



మంత్రి సత్య నుండి అవార్డునందుకుంటున్న వనజ

నెల్లూరులో నారాయణ నర్సింగ్ కళాశాల ప్రిన్సిపాల్‌గా ఉన్న డాక్టర్ బి.వనజ కుమారికి రాష్ట్రస్థాయి అవార్డు లభించింది. వైద్యఆరోగ్యకుటుంబ సంక్షేమశాఖ నర్సెస్ అండ్ మిడ్‌వైఫ్స్ విభాగం ఆధ్వర్యంలో విజయవాడలో ఇటీవల ఏర్పాటుచేసిన కార్యక్రమంలో ఆమె రాష్ట్ర వైద్యశాఖ మంత్రి సత్యకుమార్ నుంచి ఆ అవార్డును స్వీకరించారు. రాష్ట్రస్థాయిలో రీసెర్చ్ విభాగంలో అవార్డు అందుకున్న ఏకైక ప్రిన్సిపాల్ వనజకుమార్ ఒక్కరే కావడం విశేషం. ఆమె రీసెర్చ్ రంగంలో చేస్తున్న కృషిని మంత్రి ఈ సందర్భంగా అభినందించారు.


# బీసీ సంక్షేమాధికారిణికి.. పురస్కారం




మంత్రి సవిత నుండి పురస్కారాన్నందుకుంటున్న లక్ష్మమ్మ

జిల్లాలోని బీసీ సంక్షేమ వసతి గృహాలు (హాస్టళ్ళు) చదువుకుంటున్న విద్యార్థులకు ఈ ఏడాది పదో తరగతి, ఇంటర్ పరీక్షల్లో అత్యధిక మార్కులు సాధించినందుకు జిల్లా బీసీ సంక్షేమాధికారిణి వెంకటలక్ష్మమ్మకు రాష్ట్ర ప్రభుత్వం అవార్డును అందజేసింది. అందులోనూ పదో తరగతిలో మొత్తం 428 మంది విద్యార్థులు పరీక్షలు రాయగా, 91.14 శాతం ఉత్తీర్ణ సాధించినందుకు ఆమె ప్రభుత్వ అభినందనలు అందుకున్నారు. రాష్ట్ర సంక్షేమశాఖమంత్రి సవిత నుంచి ఆమె ఈ అవార్డును అందుకున్నారు.

# 19న.. తుమ్మలపెంటకి సీఎం



రాష్ట్ర ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు ఈనెల 19న నెల్లూరుజిల్లా కావలి మండలం తుమ్మలపెంట గ్రామంలో నిర్వహించే "మత్స్యకారుల సేవలో" కార్యక్రమంలో పాల్గొంటారని జిల్లా కలెక్టర్ హిమాన్షు శుక్ల తెలిపారు. ఆరోజున మత్స్యకారుల బ్యాంకు ఖాతాలకు ఆర్థిక సహాయం నగదును జమ చేస్తారని, అధికారులు సమన్వయంతో ఈ కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని కలెక్టర్ సూచించారు.

# గురుకులం విద్యార్థులకు సోమిరెడ్డి అభినందనలు



వెంకటాచలం మండలం యర్రగుంటలోని మహాత్మా జ్యోతిరావు పూలే గురుకుల పాఠశాలలో పదో తరగతి మొదటి బ్యాచ్‌లోనే అత్యుత్తమ ఫలితాలు సాధించిన విద్యార్థులను సర్వేపల్లి ఎమ్మెల్యే సోమిరెడ్డి చంద్ర మోహన్‌రెడ్డి అభినందించారు. ఎం.అజయ్‌కుమార్ 600 మార్కులకు గాను (546 మార్కులు), అదేవిధంగా కె.దర్శక్ రెడ్డి (527), డి.రవితేజ (524) మార్కులు పొందడం సంతోషకరమన్నారు. నెల్లూరు, వేదాయపాళెంలోని తమ కార్యాలయంలో ఇటీవల జరిగిన కార్యక్రమంలో విద్యార్థులతో పాటు ప్రిన్సిపల్ షరీఫ్‌ను, విద్యార్థుల తల్లిదండ్రులను కూడా ఆయన సన్మానించారు.

# బలిజ భవన్‌కి..మరో పాతిక లక్షలు

నెల్లూరు బాలాజీనగర్‌లోని బలిజ భవన్ నిర్వహణకు మరో పాతిక లక్షల రూపాయలు విరాళంగా ఇస్తామని మంత్రి నారాయణ ఇటీవల ప్రకటించారు. బలిజ భవన్ నిర్మాణానికి ఇప్పటికే తన సొంత నిధులు 30 లక్షలు వెచ్చించిన మంత్రి నారాయణ, తాజాగా భవన్ నిర్వహణ కోసం ట్రస్ట్ సభ్యులు కోరిన మరో 25 లక్షల రూపాయలను నారాయణ గ్రూప్స్ ద్వారా అందజేస్తానని హామీ ఇచ్చారు. బలిజభవన్ ట్రస్ట్ సభ్యులు డివీఎస్ గిరి, పసుపులేటి రామ్మూర్తి, కొట్టే రామ్మూర్తి, కంటే సాయి, ఐతా మోహన్‌రావు, హంసా సురేష్, గుణుకుల మల్లయ్య పాల్గొన్నారు.

**చర్చి అభివృద్ధికి..2 లక్షలు :**

నెల్లూరు సంతపేట ఉప్పరపాలెంలో ఉన్న జేమ్స్ ఆఫ్ జీసెస్ చర్చి వారి నూతన మందిరానికి మంత్రి నారాయణ ఇటీవల ప్రారంభోత్సవం చేశారు. చర్చి అభివృద్ధికి రెండు లక్షల రూపాయల సొంతనిధులను విరాళంగా ఇస్తామని మంత్రి ఈ సందర్భంగా ప్రకటించారు.

# హనుమాన్ జయంతి



హనుమత్ జయంతి సందర్భంగా ఈనెల 12న నెల్లూరు నగరంలోని శ్రీ ఆంజనేయస్వామి దేవాలయాలు, రామాలయాల్లో ప్రత్యేక పూజలు జరిగాయి. శబరి శ్రీరామక్షేత్రంలో ఆంజనేయస్వామికి విశేష పూజలు అభిషేకాలు చేశారు. సామూహిక మల్లెల అర్చన కార్యక్రమాన్ని నిర్వహించారు. అఖండ హనుమాన్ చాలీసా పారాయణం భక్తులను ఆకట్టుకుంది. ఆలయ ఛైర్మెన్ చెన్నూరు వెంకటేశ్వర్లురెడ్డి, ఆలయ కమిటీ సభ్యులు ఈ వేడుకలను పర్యవేక్షించారు.

# సేవే పరమావధిగా పనిచేయాలి

## రంగనాథస్వామి దేవాలయం పాలకమండలి ప్రమాణస్వీకారోత్సవంలో మంత్రి ఆనం



నెల్లూరు ప్రజల ఆరాధ్యదైవం..శ్రీ తల్పగిరి రంగనాథస్వామి వారి ఆలయ నూతన ధర్మకర్తల మండలి ప్రమాణస్వీకార మహోత్సవం ఈనెల 10న ఆలయ ప్రాంగణంలో జరిగింది. రాష్ట్ర దేవాదాయ మంత్రి ఆనం రామనారాయణరెడ్డి, రాష్ట్ర పురపాలక మంత్రి పొంగూరు నారాయణతో పాటు పలువురు టీడీపీ నేతలు, అధికారులు పాల్గొన్నారు. శ్రీ తల్పగిరి రంగనాథ స్వామి ఆలయ పాలకమండలి ఛైర్మెన్‌గా లెక్కల వెంకటరెడ్డి, 11 మంది పాలకమండలి సభ్యులు ప్రమాణస్వీకారం చేశారు. ఈ సందర్భంగా మంత్రి ఆనం మాట్లాడుతూ, ఆలయ బాధ్యతలు చేపట్టిన ఛైర్మన్, సభ్యులు తమ పదవిని బాధ్యతగా భావించాలని, పాలక మండలి సభ్యులు భక్తుల సేవే పరమావధిగా పనిచేయాలని సూచించారు. రాష్ట్రవ్యాప్తంగా ఇప్పటివరకు 706 ఆలయాల జీర్ణోద్ధరణ, పునర్నిర్మాణాలకు రూ.832 కోట్లకు పైగా మంజూరు చేశామన్నారు. మంత్రి నారాయణ మాట్లాడుతూ, నూతన పాలకమండలి వారు భగవంతుడి సేవలో తరించి ఆలయ ప్రతిష్టను పెంచాలని ఆకాంక్షించారు.

# అవోపా నూతన కార్యవర్గం



నెల్లూరు స్టోన్ హౌస్ పేటలో ఉన్న అవోపా భవన్‌లో ఈనెల 10న జరిగిన అవోపా (ఆర్య వైశ్య అఫిషియల్స్ అండ్ ప్రొఫెషనల్స్) సర్వసభ్య సమావేశంలో 2026-2028 సంవత్సరాలకి నూతన కార్యవర్గాన్ని ఎన్నుకున్నారు. నూతన అధ్యక్షునిగా వలేటి ప్రభాకర్, ప్రధాన కార్యదర్శిగా తవ్వా శ్రీనివాసులు, కోశాధికారిగా జీవీ సురేంద్రనాథ్ ఎన్నికయ్యారు. వీరితోపాటు ఉపాధ్యక్షులుగా ముగ్గురు, సహా కార్యదర్శులుగా నలుగురు కార్యవర్గ సభ్యులుగా 13 మందిని ఎన్నుకున్నారు. ఈ ఎన్నికకు పర్యవేక్షకులుగా సీనియర్ సభ్యులు నాతా కృష్ణకుమార్, ఎం.సీ కళాధర్ వ్యవహరించారు.

# సంతపేటలో కార్డెన్ సెర్చ్



నెల్లూరు సంతపేటలో ఈనెల 12న పోలీసులు కార్డెన్ సెర్చ్ నిర్వహించారు. ఇన్స్‌పెక్టర్ వైవి సోమయ్య ఆధ్వర్యంలో జరిగిన ఈ తనిఖీల్లో 50 మందికి పైగా పోలీసులు పాల్గొని ప్రతి ఇంటిని పరిశీలించారు. ఈ సందర్భంగా సరైన పత్రాలు లేని 33 వాహనాలను స్వాధీనం చేసుకున్నారు. అనుమానితులను స్టేషన్‌కి పిలిపించి కౌన్సిలింగ్ ఇచ్చారు. అసాంఘిక కార్యక్రమాల నిరోధానికి, శాంతి భద్రతల పరిరక్షణకి జిల్లా ఎస్పీ ఆదేశానుసారం పోలీసులు ఈ తనిఖీలు నిర్వహిస్తున్నారు.




# జూనియర్ సివిల్ జడ్జి కృష్ణప్రియాంకకి సత్కారం





ఇటీవల జిల్లా జూనియర్ సివిల్ జడ్జిగా ఎంపికైన నెల్లూరు బార్ అసోసియేషన్ సీనియర్ న్యాయవాది పీసీ కృష్ణయ్య చిన్న కుమార్తె. కృష్ణ ప్రియాంకని నెల్లూరు బార్ అసోసియేషన్ అధ్యక్షుడు పి.అయ్యప్పరెడ్డి అధ్యక్షతన జరిగిన కార్యక్రమంలో సన్మానించారు. జిల్లా ప్రధాన న్యాయమూర్తి జి.శ్రీనివాస్ ముఖ్య అతిథిగా పాల్గొని, జూనియర్ సివిల్ జడ్జిలుగా ఎంపికైన పెళ్లకూరు కృష్ణప్రియాంక దేవి, దర్శి వెంకటసత్య ధనుషా, దామరమడుగు దివ్యశ్రీ, బడుగు విశ్వజా హిందులను సన్మానించారు. నెల్లూరు బార్ అసోసియేషన్ నుంచి నలుగురు మహిళామూర్తులు జూనియర్ సివిల్ జడ్జిలుగా ఎంపిక కావడం గర్వకారణమని బార్ అసోసియేషన్ అధ్యక్షుడు అయ్యప్పరెడ్డి ఈ సందర్భంగా సంతోషం వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా పలువురు సీనియర్ న్యాయవాదులు కృష్ణ ప్రియాంకను సన్మానించారు. రాష్ట్ర బార్ కౌన్సిల్ సభ్యుడు ఎస్.అంకయ్య, బార్ అసోసియేషన్ ప్రధాన కార్యదర్శి ఎన్.నాగరాజు, ఉపాధ్యక్షుడు జల్లి పద్మాకర్, సంయుక్త కార్యదర్శి కేవీల్ నారాయణ, సీనియర్ న్యాయవాది రోజారెడ్డి పాల్గొన్నారు. కాగా, ప్రియాంక సోదరి పూర్ణిమ కూడా చిత్తూరు జిల్లాలో జూనియర్ సివిల్ జడ్జిగా పనిచేస్తున్నారు. వీరి మరొక సోదరి నెల్లూరు బార్ అసోసియేషన్‌లో న్యాయవాది కూడా.

# నెల్లూరులో త్వరలో 200 ఈ-ఆటోలు

## • మంత్రి నారాయణ వెల్లడి



ఈ-ఆటో ఛార్జింగ్ స్టేషన్ ప్రహరీగోడకు శంకుస్థాపన చేస్తున్న మంత్రి

నెల్లూరు సిటీని సుందరంగా తీర్చిదిద్దడమే తన లక్ష్యమని రాష్ట్ర పురపాలక మంత్రి డాక్టర్ పొంగూరు నారాయణ చెప్పారు. ఇటీవల ఆయన నెల్లూరులోని వేంకటేశ్వరపురంలో 40 లక్షలతో ఈ-ఆటో ఛార్జింగ్ స్టేషన్ ప్రహరీ గోడకు శంకుస్థాపన చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, నగరానికి వచ్చిన 200 ఈ-ఆటోలను ఈ నెలాఖరుకల్లా ప్రారంభిస్తామని తెలిపారు. అనంతరం 1.40కోట్లతో నగరంలోని రేబాలవారివీధిలో నిర్మిస్తున్న పార్కును, ఏసీ ఫంక్షన్ హాల్, అత్యాధునిక జిమ్ పనులను మంత్రి పర్యవేక్షించారు.

ఆంధ్రప్రదేశ్‌ను చెత్తరహిత రాష్ట్రంగా తీర్చిదిద్దడమే ప్రభుత్వ లక్ష్యమని మంత్రి నారాయణ స్పష్టం చేశారు. ఇటీవల ఆయన నెల్లూరు రూరల్‌లోని దొంతాలి డంపింగ్ యార్డ్, ప్రాసెసింగ్ ప్లాంట్ పనులను పరిశీలించారు. అనంతరం విలేకర్లతో మాట్లాడుతూ, తమ కూటమి ప్రభుత్వం వచ్చాక రాష్ట్రవ్యాప్తంగా ఇప్పటికే 85 లక్షల టన్నుల చెత్తను తొలగించామని, దొంతాలిలో ఉన్న 65 వేల టన్నుల చెత్తను ఈ నెలాఖరుకల్లా తొలగిస్తామని చెప్పారు. దొంతాలిలో రెండేళ్లలో వేస్ట్ టు ఎనర్జీ ప్లాంట్ పూర్తి చేస్తామని, ఇది అందుబాటులోకి వస్తే 100 కిలోమీటర్ల పరిధిలోని చెత్తను ఏరోజుకారోజు పరిశుభ్రం చేయించవచ్చని తెలిపారు.

### మహిళలకు కోటి ఇరవై లక్షల సొంతనిధులు

మంత్రి నారాయణ మెప్మా మహిళలకు అండగా నిలిచారు. ఇచ్చిన మాట ప్రకారం స్మార్ట్ స్ట్రీట్‌లో వ్యాపారం చేస్తున్న 120 మంది మెప్మా మహిళలకు రెండు విడతల్లో కోటి ఇరవై లక్షలు రూపాయల తన సొంతనిధులను వారికి అందచేశారు. మహిళలని ఆర్థికస్వావలంబన వైపు నడిపించాలన్న సంకల్పంతో నెల్లూరు మైపాడు గేట్ సెంటర్‌లో స్మార్ట్‌స్ట్రీట్‌ను ప్రయోగాత్మకంగా ఏర్పాటు చేసిన విషయం తెలిసిందే. తొలి విడతలో మెప్మా మహిళలకు రూ.50 వేల చొప్పున మంత్రి నారాయణ అందచేశారు. తాజాగా మలివిడతలో మరో 50వేల రూపాయల చెక్కులను స్మార్ట్ స్ట్రీట్‌లో దుకాణాలు ఏర్పాటుచేసుకున్న 76 మందికి అందచేశారు.

### రామాలయానికి 10 లక్షలు విరాళమిస్తా



భూమిపూజ చేస్తున్న నారాయణ

కుల మతాలకు అతీతంగా అడిగినవారికి కాదనకుండా ఆర్థిక సహాయం అందించే మంత్రి నారాయణ నెల్లూరు 10వ డివిజన్‌లో నూతనంగా నిర్మిస్తున్న రామాలయానికి తమ నారాయణ గ్రూప్స్ నుంచి పది లక్షల రూపాయలు విరాళంగా ఇస్తానని హామీ ఇచ్చారు. తొలుత, ఆలయ నిర్మాణానికి మంత్రి భూమిపూజ చేశారు. 1.70 కోట్లతో నూతన మండప నిర్మాణానికి ఆలయ కమిటీ శ్రీకారం చుట్టిందని, ఆలయ నిర్మాణానికి సహకరించిన దాతలు రామచంద్రనాయుడుకి, మంకు వెంకటేశ్వర్లుకీ ధన్యవాదాలు తెలిపారు. వేమిరెడ్డి విజయభాస్కర్ రెడ్డి, ఆలయ కమిటీ ఛైర్మన్ సంజీవనాయుడు, సభ్యులు పాల్గొన్నారు.

# క్రీడాస్ఫూర్తితో రాణించాలి

## కబడ్డీ క్రీడాకారులతో మంత్రి ఆనం



విజేత జట్టుకు ట్రోఫీని అందజేస్తున్న మంత్రి ఆనం రామనారాయణరెడ్డి

క్రీడాకారులు క్రీడాస్ఫూర్తితో రాణించాలని రాష్ట్ర దేవాదాయ మంత్రి ఆనం రామనారాయణరెడ్డి ఆకాంక్షించారు. సంగం మండలం దువ్వూరులో ఇటీవల నాలుగు రోజులపాటు ఎంతో ఉత్సాహభరితంగా జరిగిన రాష్ట్రస్థాయి ఛాంపియన్ షిప్ కబడ్డీ పోటీల ఫైనల్స్‌ను ఆయన ఈనెల 10న తమ కుమార్తె కైవల్యారెడ్డి, స్థానిక టీడీపీ నాయకులతో కలిసి తిలకించి, క్రీడాకారుల్లో ఉత్సాహం నింపారు. 26 జిల్లాల నుంచి వచ్చిన క్రీడాకారులతో ఈ పోటీలు కోలాహలంగా జరిగాయి. ఈ సందర్భంగా మంత్రి ఆనం మాట్లాడుతూ, కబడ్డీ రాష్ట్రస్థాయి పోటీలకు ఆత్మకూరు నియోజకవర్గంలోని దువ్వూరు గ్రామం వేదిక కావడం చాలా సంతోషంగా ఉందన్నారు. ఈ పోటీల్లో మహిళల విభాగంలో ప్రథమ స్థానంలో విజయనగరం, ద్వితీయ స్థానంలో శ్రీకాకుళం, తృతీయ స్థానంలో నెల్లూరు బాపట్ల జట్లు విజయం సాధించాయి. అదేవిధంగా, పురుషుల్లో మొదటి స్థానం బాపట్ల, రెండవ స్థానం నెల్లూరు జిల్లా జట్లు కైవసం చేసుకోగా, పల్నాడు, కృష్ణా జిల్లాలే 3, 4 స్థానాలు సాధించాయి. క్రీడాకారులను, విజేతలను, పోటీల నిర్వాహకులను మంత్రి అభినందించారు. క్రీడాకారులు మరింత ఉత్సాహంతో జాతీయస్థాయిలో రాణించాలని ఆయన చెప్పారు.

# జొన్నవాడలో వైభవంగా తిరుచా ఉత్సవం



బుచ్చిరెడ్డిపాలెం జొన్నవాడలోని శ్రీ మల్లికార్జున స్వామి సమేత శ్రీ కామాక్షితాయి అమ్మవారి దేవస్థానంలో జరుగుతున్న బ్రహ్మోత్సవాల్లో భాగంగా ఇటీవల తిరుచా ఉత్సవం వైభవంగా జరిగింది. కీర్తిశేషులు వి.వి సుబ్రహ్మణ్యం కుటుంబ సభ్యులు (ఆత్మకూరు) ఉభయకర్తలుగా వ్యవహరించారు. ఆ రాత్రి పురుషామృగ వాహనంపై శ్రీ మల్లికార్జున స్వామి వారు గ్రామోత్సవంలో భక్తులకు దర్శనమిచ్చారు. భక్తుల కోలాటం, కూచిపూడి నృత్యం, పౌరాణిక నాటక ప్రదర్శనలు ఆకట్టుకున్నాయి. భక్తులకు ఎలాంటి అసౌకర్యం కలుగకుండా ఆలయ అధికారులు ఏర్పాట్లను చేపట్టారు. దేవస్థాన సహాయ కమిషనర్ మరియు కార్యనిర్వహణాధికారి అర్వభూమి వెంకట శ్రీనివాసులురెడ్డి, పాలక మండలి ఛైర్మెన్ తిరుమూరు అశోక్‌రెడ్డి, సభ్యులు ఎన్.శివకృష్ణ, జొన్నలగడ్డ వరలక్ష్మి, పి.సుమలత, చాముండేశ్వరి, కె.శ్రీనివాసులు, సుధారాణి తదితరులు పాల్గొన్నారు. బుచ్చిరెడ్డిపాలెం సీఐ ఎం.శ్రీనివాసరావు బందోబస్తు ఏర్పాట్లను పర్యవేక్షించారు.









ఉత్తరక్రియలు

ఎప్పటికీ మా గుండెల్లో నిలిచిపోయే
మా ఇంటి దైవం
**పోచారెడ్డి భక్తవత్సలరెడ్డి** గారు
తేది. 7.5.2026 గురువారం స్వర్గస్తులైనారు.
వారి పవిత్ర ఆత్మకు శాంతి చేకూరాలని భగవంతుని ప్రార్థిస్తూ...

భార్య : పోచారెడ్డి ఆనందమ్మ
కుమారుడు : పోచారెడ్డి గోపీనాథరెడ్డి
తమ్ముళ్లు : పోచారెడ్డి ఆదిశేషారెడ్డి, పోచారెడ్డి ప్రభాకర్‌రెడ్డి
మొబైల్ : 93412 75918, 94481 90800

వారి పెద్దకర్మ
తేది. 21.5.2026 గురువారం ఉ॥ 10.00 గం.లకు
నెల్లూరు, దర్గామిట్ట, పాత మిలిటరి కాలనీ (డో.నెం. 24-2-1550)లో
మా స్వగృహము నందు జరుగును. కావున తెలియజేయడమైనది.

పంక్తి (Lunch) : ఉదయం 11.30 గం.లకు
నెల్లూరు, మద్రాసు బస్టాండ్ దగ్గర, 'హోటల్ D.R. ఉత్తమ' ఇంద్రప్రస్థ నందు జరుగును.

# గూడూరు డివిజన్

## ఆటోనగర్‌లో అభివృద్ధి పనులు

- శంకుస్థాపన చేసిన ఎమ్మెల్యే సునీల్



గూడూరు పట్టణంలోని దివిపాలెం సమీపంలో ఏపీఐఐసి ఆధ్వర్యంలో నూతనంగా ఏర్పాటు చేస్తున్న ఆటోనగర్‌లో ఎమ్మెల్యే పాశిం సునీల్‌కుమార్ ఇటీవల పర్యటించారు. నూతనంగా నిర్మిస్తున్న 11 కెవి విద్యుత్ లైన్, ఎల్ఇడి లైట్ల ఏర్పాటుకు ఎమ్మెల్యే శంకుస్థాపన చేశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే సునీల్ మాట్లాడుతూ 75 ఎకరాల్లో ఆటోనగర్ ఏర్పాటు చేస్తున్నామని, ఇప్పటికే 107 మందికి షాపులు కేటాయించడం జరిగిందని తెలిపారు. అలాగే ఆటోనగర్‌లో అన్ని రకాల మౌలిక వసతులు ఏర్పాటు చేస్తున్నామని, త్వరలోనే ఈ ప్రాంతం ఎంతో అభివృద్ధి చెందుతుందని తెలిపారు. టీడీపీ రాష్ట్ర కార్యదర్శి మట్టం శ్రావణిరెడ్డి, టీడీపీ రాష్ట్ర కార్యనిర్వాహక కార్యదర్శి బిల్లు చెంచురామయ్య తదితరులు పాల్గొన్నారు.

## నేరాల నియంత్రణకు చర్యలు



స్థానికులతో మాట్లాడుతున్న సీఐ శేఖర్‌బాబు

గూడూరులోని జనార్ధనరెడ్డి కాలనీలో టౌన్ సీఐ శేఖర్‌బాబు ఆధ్వర్యంలో ఈ నెల 10వ తేదీ కార్డన్‌సెర్చ్ నిర్వహించారు. సరైన పత్రాలు లేని ద్విచక్రవాహనాలు, ఇతర వాహనాలను సీజ్ చేసి, అనుమానిత వ్యక్తులను అదుపులోకి తీసుకొని విచారించారు. సీఐ మాట్లాడుతూ నేరాల నియంత్రణలో భాగంగా కార్డన్‌సెర్చ్ నిర్వహించామని, యువత చెడు వ్యసనాలకు దూరంగా ఉండాలని సూచించారు.



అంతర్జాతీయ నర్సుల దినోత్సవం సందర్భంగా రోటరీ క్లబ్ ఆధ్వర్యంలో గూడూరు రోటరీ భవన్‌లో ఎనిమిది మంది నర్సులను సన్మానించారు. రోటరీ ప్రెసిడెంట్ వెంకటేశ్వర్లురెడ్డి, మయూరి శ్యాంయాదవ్, సభ్యులు పాల్గొన్నారు.



## శ్రీకంటి జన్మదిన వేడుకలు

ప్రముఖ చార్టెడ్ అకౌంటెంట్, శ్రీ ప్రసన్న వెంకటేశ్వరస్వామి దేవస్థానం పాలకమండలి ఛైర్మెన్ శ్రీకంటి రామ్మోహన్‌రావు పుట్టినరోజు వేడుకలు ఈ నెల 11న ఘనంగా జరిగాయి. వెంకటేశ్వరస్వామి దేవస్థానం వాలంటీర్‌లు రామ్మోహన్ నివాసంలో ఏర్పాటు చేసిన కేకును ఆయన కట్ చేసి అందరికీ పంచారు. అలాగే మాలవ్య నగర్ సెంటర్లో మజ్జిగను పంపిణీ చేశారు.



గూడూరు బ్రాహ్మణ సేవా సంఘం అధ్యక్షులు ఆనిమెళ్ళ శివకుమార్ రామమోహన్‌రావుని ఆయన కార్యాలయంలో కలిసి ఘనంగా సన్మానించారు.

## కనువిందుగా.. కవితోత్సవంగా...

# 'అక్షరోత్సవం'

**అలరించిన ఆపాతమధురాలు.. సాహితీ ప్రసంగాలు**

**'చిన్ని' ఆధ్వర్యంలో కవిత్వాభిమానులకు పెద్ద పండుగ!**

*ఆకట్టుకునే చిన్నారుల సంప్రదాయ నృత్యాలు, వీనులవిందు చేసే ఆపాతమధుర గీతాలు, వక్తల చైతన్యవంతమైన సందేశాలతో 'అక్షరోత్సవం' కార్యక్రమం కనువిందుగా.. ఒక సాహితీ పండుగగా జరిగింది. ఈ ఉత్సవానికి నెల్లూరు పురమందిరం వేదికైంది. ఈనెల 10వ తేదీ ఆదివారం ప్రముఖ కవి.. 'కళారత్న' చిన్ని నారాయణరావు సాహితీ ఫౌండేషన్ ఆధ్వర్యంలో జరిగిన ఈ సాహిత్యోత్సవంలో హైదరాబాద్‌కి చెందిన ప్రముఖ కవి కొప్పర్తి వెంకటరమణమూర్తికి ప్రధానమైన అవార్డుతో పాటు 10వేల రూపాయల నగదు బహుమతినిచ్చి సత్కరించారు. మరో ముగ్గురు కవులకు పురస్కారాలను ప్రదానం చేశారు.*



ముఖ్యఅతిథుల నుండి చిన్ని నారాయణరావు సాహితీ ఫౌండేషన్ ప్రధాన అవార్డును అందుకుంటున్న కొప్పర్తి వెంకటరమణమూర్తి



అక్షరయోధులు.. తుంగా రాజగోపాలరెడ్డి, సత్యవేటి శ్రీకాంత్, డా. నాగభైరవ కోటేశ్వరరావుల స్మారక పురస్కారాలనందుకున్న మద్దూరు శ్రీనివాసులు, వైహెచ్‌కే మోహన్‌రావు, గంగవరపు సునీత

'చిన్ని నారాయణరావు సాహితీ ఫౌండేషన్' స్థాపించి గత మూడేళ్లుగా తమకు కవిత్వంలో, రచనల్లో మార్గదర్శకులైన గురువుల పేర్లను శాశ్వతం చేస్తూ, ప్రతిఏటా ముగ్గురికి నగదు పురస్కారాలను అందిస్తున్న విషయం తెలిసిందే. అంతే కాదు, సాధారణంగా కవులు-రచయితలు తమ సొంత పుస్తకాలు ముద్రించుకోవడం సర్వసాధారణం.. అయితే చిన్ని నారాయణరావు తన సొంతడబ్బులతో అందరి కవితలను ముద్రిస్తూ అటు ప్రముఖులు-ఇటు చిన్నారుల కవితలను కూడా సేకరించి 'అక్షరోత్సవం కవితా సంపుటి'గా వెలువరించడం విశేషం. ఈ సందర్భంగా ఆయన రాసిన కవితా సంపుటితో పాటు, 'అక్షరోత్సవం' కవుల కవితా సంపుటి కూడా ఉండడం సాహిత్యాభిమానులను ఎంతగానో ఆకట్టుకుంది. మదులిక ప్రార్థనాగీతంతో ప్రారంభమైన ఈ కార్యక్రమంలో, వక్తల సందేశాలు అందరినీ ఆకట్టుకున్నాయి. 'లాయర్' పత్రిక సంపాదకులు తుంగా శివప్రభాత్‌రెడ్డి అధ్యక్షతన జరిగిన ఈ కార్యక్రమంలో జిల్లా గ్రంథాలయ సంస్థ ఛైర్‌పర్సన్ మేకపాటి శాంతికుమారి, 'శుభమస్తు' అధినేత బయ్యా శ్రీనివాసులు, పిక్‌నిక్ ఐస్‌క్రీమ్స్ అధినేత వీరిశెట్టి హజరత్‌బాబు, సాహితీవేత్త శ్రీరామకవచం సాగర్, నవ మల్లెతీగ పత్రిక సంపాదకుడు కలిమిశ్రీ, చిన్ని నారాయణరావు.. ఆయన తనయుడు చిన్ని శ్రావణ్‌కుమార్ తదితరులు పాల్గొని కవి కొప్పర్తిని సన్మానించారు. చిన్ని నారాయణరావు మాట్లాడుతూ, ఈ వేదికపై తనకు స్ఫూర్తినందించిన గురువులు.. అక్షరయోధుల పేరుతో.. పేరెన్నికగన్న సాహితీమూర్తులకు పురస్కారాలను అందించడం తానెంతో ఆత్మీయంగా, గౌరవప్రదంగా భావిస్తున్నానన్నారు.

తొలుత, అక్షరయోధులు.. స్వర్గీయ తుంగా రాజగోపాలరెడ్డి స్మారక పురస్కారాన్ని ప్రముఖ కవి-పాత్రికేయుడు మద్దూరు శ్రీనివాసులుకు, దివంగత సత్యవేటి శ్రీకాంత్ స్మారకంగా ఇచ్చే పురస్కారాన్ని ప్రముఖ కవి-రచయిత వైహెచ్‌కే మోహన్‌రావుకు, కీ.శే డా. నాగభైరవ కోటేశ్వరరావు స్మారక పురస్కారాన్ని ప్రముఖ కవయిత్రి గంగవరపు సునీతకు ప్రదానం చేశారు.

ఈ సందర్భంగా, చిన్ని నారాయణరావు రచించిన 'వెలుగుపూల వసంతం', నెల్లూరుజిల్లా కవులు కవితలతో 'అక్షరోత్సవం' కవితా సంకలనంతో పాటు, ప్రముఖ కవి ఏటూరి నాగేంద్రరావు రచించిన 'ఓ అశాంతుడి స్వప్నం' కవితా సంపుటిలను ఆవిష్కరించారు.

### సమాజాన్ని చైతన్యవంతం చేసే.. కవిత్వం

**- కొప్పర్తి వెంకటరమణమూర్తి**



చిన్ని నారాయణరావు సాహితీ ఫౌండేషన్ ప్రధాన అవార్డు గ్రహీత కొప్పర్తి వెంకటరమణమూర్తి మాట్లాడుతూ, సమాజాన్ని చైతన్యవంతం చేసే అద్భుతమైన కళ కవిత్వమేనన్నారు. కవిత్వం హృదయానికి హత్తుకునేలా ఉండాలని, సమాజానికి చైతన్యగీతిక కావాలని చెప్పారు. సంగీతానికి సాహిత్యానికి ఉన్న అక్షరానుబంధాన్ని ఆయన వివరించారు.

### 'చిన్ని' సాహితీ సేవలు అపూర్వం

**- తుంగా శివప్రభాత్‌రెడ్డి**



'లాయర్' సంపాదకులు శివప్రభాత్‌రెడ్డి తన ప్రసంగంలో.. చిన్ని నారాయణరావు సాహితీసేవలను అభినందించారు. ఎన్నో ఏళ్ళుగా కవితాలోకంలో ప్రసిద్ధిని పొంది, తనకు స్ఫూర్తినిచ్చిన మహనీయుల పేర్లతో గత మూడేళ్ళుగా 'చిన్ని నారాయణరావు సాహితీ ఫౌండేషన్' పేరుతో పురస్కారాలు ప్రదానం చేయడం అభినందనీయమన్నారు. ఈ సంప్రదాయాన్ని కొనసాగించాలని ఆయన ఆకాంక్షించారు.

### కవులు సమాజానికి జ్ఞానదీపాలు

**- మేకపాటి శాంతికుమారి**



జిల్లా గ్రంథాలయ సంస్థ ఛైర్‌పర్సన్ శాంతికుమారి మాట్లాడుతూ, కవులు సమాజానికి జ్ఞానదీపాలని అన్నారు. అక్షరాన్ని ఆరాధించే సమాజం ఏనాటికీ వెనుకబడదన్నారు. నేటికీ సమాజంలో మహిళల జీవితాలు దయనీయంగానే ఉంటున్నాయని, వారి సమస్యల పట్ల కూడా కవులు స్పందించాలని ఆమె సూచించారు. జిల్లాలోని గ్రంథాలయాల అభివృద్ధికి తనవంతు కృషి చేస్తానని చెప్పారు.

### కవులు సమాజానికి హితులు

**- బయ్యా వాసు**



కవులు సమాజానికి హితులని, శాంతి సహనాలకి నిలయమైన మనదేశంలోని సంప్రదాయాలు ఎంతో గొప్పవని, ప్రతి ఒక్కరూ వాటిని కంటికి రెప్పలా కాపాడుకోవాలని ఈ కార్యక్రమంలో ముఖ్య అతిథిగా పాల్గొన్న 'శుభమస్తు' అధినేత బయ్యా శ్రీనివాసులు పిలుపునిచ్చారు.

### ఆకట్టుకున్న ఆపాతమధురాలు



అక్షరోత్సవం కార్యక్రమంలో భాగంగా కళాంజలి అనంత్ సారధ్యంలో జరిగిన సంగీత విభావరి సభికులను ఆకట్టుకుంది. ప్రముఖ గాయనీ గాయకులు కృష్ణయ్య, వేదాంబిక నాయుడు, సునయని, శ్రీకృతి, కీర్తన్, విజయకుమార్‌ల మధుర గానాలను, రామ్‌కిరణ్-వరుణ్‌ల కీబోర్డు, శాంతికుమార్ తబలా వాద్యాలు మరింత ఇనుమడింపజేశాయి. ప్రముఖ నృత్యకళా కారిణి జస్విఖశ్రీ నృత్యం అందరినీ అలరించింది. ప్రముఖ రంగస్థల నటుడు దువ్వూరు బెనర్జీ వ్యాఖ్యాతగా వ్యవహరించారు.

# 'మహానాడు' విజయవంతానికి కృషి

## మాజీమంత్రి, సర్వేపల్లి ఎమ్మెల్యే సోమిరెడ్డి

తెలుగుదేశం పార్టీ ఆవిర్భావం తర్వాత తొలిసారిగా నెల్లూరులో మహానాడు నిర్వహిస్తుండటం ఆనందంగా ఉందని, ఈనెల 27, 28, 29 తేదీల్లో మహానాడు పెద్దఎత్తున జరగ బోతోందని మాజీమంత్రి, సర్వేపల్లి శాసనసభ్యులు సోమిరెడ్డి చంద్రమోహన్‌రెడ్డి చెప్పారు. ఇటీవల ఆయన కొడవలూరు మండలం రేగడిచెలిక వద్ద మహానాడు ఏర్పాట్లను ఎంపీ బీద మస్తాన్‌రావుతో కలిసి పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, ఇఫ్‌కో కిసాన్ సెజ్ ప్రాంగణంలో చాలా విశాలమైన స్థలంలో భారీ ఎత్తున ఏర్పాట్లు జరుగుతున్నాయని, 200 ఎకరాలు సభా ప్రాంగణానికి, మరో 300 ఎకరాలు వాహనాల పార్కింగ్‌కు సిద్ధమవుతున్నాయని చెప్పారు. తెలుగుదేశం నాయకులు, కార్యకర్తలు అందరం కలిసి మహానాడు విజయవంతానికి కృషిచేస్తున్నా మన్నారు. టీడీపీ జిల్లా ప్రధాన కార్యదర్శి చేజర్ల వెంకటేశ్వర్లురెడ్డి తదితరులు పాల్గొన్నారు.



ఎంపీ బీద మస్తాన్‌రావు, టీడీపీ జిల్లా ప్రధాన కార్యదర్శి చేజర్ల వెంకటేశ్వర్లురెడ్డిలతో ఏర్పాట్లను పరిశీలిస్తున్న ఎమ్మెల్యే సోమిరెడ్డి

### వైసీపీ పాపాలు...

వైసీపీ పాపాల ఫలితంగానే భూముల రికార్డులన్నీ తప్పులు తడకలుగా నమోదయ్యాయని, తమ కూటమి ప్రభుత్వం వచ్చాక వాటినన్నిటినీ సరిదిద్ది రైతులకు పట్టాదారు పాసుపుస్తకాలు అందజేస్తున్నామని మాజీమంత్రి, సర్వేపల్లి ఎమ్మెల్యే సోమిరెడ్డి చంద్రమోహన్‌రెడ్డి చెప్పారు. ఇటీవల ఆయన మనుబోలు మండల పరిషత్ కార్యాలయంలో చెరుకుమూడి, గురివిందపూడి, కొమ్మల పూడి రైతులకు పట్టాదారు పాసుపుస్తకాల పంపిణీ చేశారు. ప్రజాదర్బార్ నిర్వహించి అధికారులకు తగు సూచనలిచ్చారు. వైసీపీ పాలనలో ఊళ్లకు ఊళ్లపై కక్షకట్టి నిషేధిత జాబితాలో చేర్చారని, సర్వే ప్రక్రియను వైసీపీ ప్రభుత్వం తప్పుల కుప్పగా మిగిల్చిందని విమర్శించారు. దీంతో రైతులు బ్యాంకుల్లో రుణాలు పొందేందుకు ఇబ్బందులు ఎదుర్కొంటున్నారన్నారు. కూటమి ప్రభుత్వం వచ్చాక పొదలకూరు మండలం పార్లపల్లి, మర్రిపల్లి గ్రామాల సమస్యను పరిష్కరించామని, మహ్మదాపురం, వెలికంటి పాళెం భూములకు కూడా విముక్తి కల్పించాల్సివుందని అన్నారు. రైతులకు సంబంధించిన ప్రతి అర్జీని అధికారులు పరిష్కరించాల న్నారు. సర్వేపల్లి నియోజకవర్గంలో వివిధ ఉపకరణాల సబ్సిడీ కోసం రూ.81 లక్షలు విడుదలయ్యాయని, జలధార కార్యక్ర మంలో భాగంగా రూ.3.50 కోట్లతో సాగునీటి సంఘాల పరిధిలో కాలువలు బాగుచేసుకునే కృషి జరుగుతోందని వివరించారు.

# తలసేమియా బాధితులను ఆదుకోవాలి - జేసీ మొగిలి

తలసేమియా వ్యాధి బాధితులను ఆదుకోవాలని జిల్లా జాయింట్ కలెక్టర్ మొగిలి వెంకటేశ్వర్లు పిలుపునిచ్చారు. ప్రపంచ రెడ్ క్రాస్ దినోత్సవం మరియు ప్రపంచ తలసేమియా దినోత్సవాల సందర్భంగా ఇటీవల నెల్లూరులోని రెడ్‌క్రాస్ కార్యాలయంలో జరిగిన కార్యక్రమంలో ఆయన పాల్గొని రెడ్ క్రాస్ వ్యవస్థాపకుడు జీన్ హెన్రీ డ్యునాంట్ విగ్రహానికి పూలమాలలు సమర్పించి నివాళులర్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, రెడ్ క్రాస్ సంస్థ ప్రపంచవ్యాప్తంగా మానవతా సేవలకు ప్రతీకగా నిలుస్తోందన్నారు. తలసేమియా బాధిత చిన్నారులకు ప్రతి నెలా రక్తం అవసరం అవుతుందని, అలాంటి పిల్లల ప్రాణాలను కాపాడేది స్వచ్ఛంద రక్తదాతలేనని తెలిపారు. యువత పెద్ద ఎత్తున రక్తదాన కార్యక్రమాల్లో పాల్గొని బాధితులను ఆదుకోవా లన్నారు. రెడ్ క్రాస్ ఛైర్మన్ వాకాటి విజయకుమార్‌రెడ్డి మాట్లాడుతూ యువత రక్తదానానికి ముందుకు రావాలని కోరారు. అనంతరం రక్తదాతలను, సేవా కార్యక్రమాల్లో సహకరిస్తున్న దాతలను సన్మానించారు. తలసేమియా బాధిత చిన్నారులకు సర్టిఫికెట్లు అందజేసి ప్రోత్సహించారు. రెడ్ క్రాస్ మేనేజింగ్ కమిటీ సభ్యులు, కాన్సర్ హాస్పిటల్ కో-ఆర్డినేటర్ యాలమూరి రంగయ్యనాయుడు, తలసేమియా విభాగం ఎగ్జిక్యూటివ్ మెంబర్ డాక్టర్ సీత, రెడ్ క్రాస్ నెల్లూరుజిల్లా శాఖ వైస్‌ఛైర్మన్ చమర్తి జనార్ధన్‌రాజు, కోశాధికారి సురేష్‌కుమార్ జైన్, మేనేజింగ్ కమిటీ సభ్యులు దాసరి రాజేంద్రప్రసాద్, కలికి శ్రీహరిరెడ్డి, యాలమూరి రంగయ్యనాయుడు, బయ్యా ప్రసాద్, సెక్రెటరీ పి.మస్తానయ్య, బ్లడ్ సెంటర్ మెడికల్ ఆఫీసర్ డాక్టర్ వరప్రసాద్, తలసేమియా సేవా ఎగ్జిక్యూటివ్ మెంబర్ శ్రీమతి షేక్ పర్వీన్, రెడ్ క్రాస్ మాజీ ఛైర్మన్ డాక్టర్ ఏ.వి. సుబ్రహ్మణ్యం తదితరులు పాల్గొన్నారు.



జేసీ మొగిలి వెంకటేశ్వర్లుని సత్కరిస్తున్న రెడ్ క్రాస్ సభ్యులు

# 21 నుండి.. ఇంటర్ అడ్వాన్స్‌డ్ సప్లిమెంటరీ పరీక్షలు

## పటిష్ఠంగా నిర్వహించాలన్న డీఆర్‌ఓ విజయకుమార్



జిల్లాలో ఈనెల 21 నుండి ఇంటర్మీడియట్ అడ్వాన్స్ సప్లిమెంటరీ పరీక్షలు ప్రారంభం కానున్నాయి. అదేవిధంగా, ఈనెల 25వ తేదీ నుంచి పదో తరగతి అడ్వాన్స్ సప్లిమెంటరీ పరీక్షలు కూడా నిర్వహించేందుకు జిల్లా అధికారులు ఏర్పాట్లు చేస్తున్నారు. మంగళవారం కలెక్టరేట్‌లోని తన ఛాంబర్‌లో జిల్లా రెవెన్యూ అధికారి విజయకుమార్ ఈ పరీక్షల నిర్వ హణపై సంబంధిత అధికారులతో సమన్వయ కమిటీ సమా వేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, అధికారులందరూ ఎటు వంటి లోటుపాట్లు లేకుండా పరీక్షలను ప్రశాంతంగా, పటిష్ఠంగా నిర్వహించాలని సూచించారు. ఇంటర్మీడియట్ అధికారి వరప్రసాద్ మాట్లాడుతూ ఈనెల 21 నుంచి జూన్ 4వతేదీ వరకు జిల్లాలో 66 పరీక్షా కేంద్రాల్లో ఇంటర్మీడియట్ పరీక్షలు నిర్వహిం చేందుకు ఏర్పాట్లు చేస్తున్నట్లు చెప్పారు. ఇంటర్ మొదటి, ద్వితీయ సంవత్సరాలకు సంబంధించి 28693 మంది విద్యార్థులు పరీక్షలకు హాజరు కానున్నట్లు తెలిపారు. పరీక్షలకు సంబంధించి విద్యార్థులకు ఏమైనా సందేహాలు ఉంటే కంట్రోల్‌రూమ్ నెంబర్ 0861-2320312 నెంబర్‌లో సంప్రదించాలని ఆయన సూచించారు. జిల్లా విద్యా శాఖాధికారి ఆర్ బాలాజీరావు మాట్లాడుతూ జిల్లాలో ఈనెల 25 నుంచి జూన్ 4వ తేదీ వరకు వరకు పదోతరగతి అడ్వాన్స్ సప్లిమెంటరీ పరీక్షలు నిర్వహించనున్నట్లు చెప్పారు. మొత్తం 31 సెంటర్లలో 4124 మంది విద్యార్థులు పరీక్షలకు హాజరుకానున్నట్లు చెప్పారు. అలాగే ఈనెల 25 నుంచి జూన్ 1వ తేదీ వరకు ఏపి ఓపెన్ స్కూల్ ఇంటర్, టెన్త్ అడ్వాన్స్ సప్లిమెంటరీ పరీక్షలు కూడా నిర్వహించనున్నట్లు తెలిపారు.



# హనుమాన్ శోభాయాత్ర

హనుమాన్ జయంతిని పురస్కరించు కొని హిందూ చైతన్య వేదిక ఆధ్వర్యంలో గూడూరు రెండో పట్టణ పరిధిలోని సిరా మిక్ కాలేజ్ ప్రాంగణంలో ఉన్న శ్రీ ప్రసన్న ఆంజనేయస్వామి దేవస్థానం వద్ద నుండి గూడూరు పట్టణ పురవీధుల గుండా కోనేటిమిట్ట వరకు శోభాయాత్ర నిర్వహిం చారు. యువత మన ధర్మాన్ని కాపాడేం దుకు కృషి చేయాలని హిందూ ధర్మ పరి రక్షణ ట్రస్ట్ రాష్ట్ర కో-ఆర్డినేటర్ కోట సునీల్ కుమార్ స్వామి తెలిపారు. బీజేపీ నాయ కులు దయాకర్, బాల కృష్ణమనాయుడు, హిందూ చైతన్య వేదిక కన్వీనర్ మల్లి కార్జున, రామయ్య, పాలవెల్లి మౌనిష్, శివ, హరికృష్ణ తదితరులు పాల్గొన్నారు.

# వ్యక్తిగత అధ్యయనంతోనే బంగారు భవిత!

జ్ఞాన నేత్రం
డా. నరసింహారెడ్డి ఊరిమిండి
Dallas, Texas, USA

ప్రపంచం వేగంగా మారుతోంది. జ్ఞానం ఇక పుస్తకాలలో మాత్రమే కాదు, మనచేతిలోని చిన్న ఫోన్ వంటి పరికరాల్లో, మన చుట్టూ ఉన్న అను భవాల్లో, మన ఆలోచనల్లోకి కూడా వచ్చేసింది. ఈ మారుతున్న ప్రపంచంలో అత్యంత విలువైన నైపుణ్యం ఏమిటంటే, స్వయంగా నేర్చుకునే శక్తి. గురువు, తరగతి, పాఠశాల, ఇవి అన్నీ అవసరం. కానీ వాటికంటే గొప్పది మనలోని స్వీయ అధ్యయన సామర్థ్యం. అందుకే పురాతన సూక్తి చెబుతుంది. 'ఆత్మనో బలవంతః'..నిజమైన బలం మనలో నుంచే వస్తుంది. ఒక విద్యార్థి రోజూ గురువు చెప్పినదే చదివితే, పరీక్షల్లో ఉత్తీర్ణుడవుతాడు. కానీ స్వయంగా నేర్చుకునే శక్తి పెంచుకుంటే, ఆ విద్యార్థి తన జీవితంలోనూ ఉత్తీర్ణత చెందుతాడు. ఎందుకంటే సమాజంలోని అనేక ప్రశ్నలు పుస్తకాల్లో ఉండవు; అవి మన అనుభవాల్లో, మన నిర్ణయాల్లో, మన ఆలోచనల్లో ఉంటాయి. ఒక చిన్న ఉదాహరణ చూద్దాం. అమెరికాలో చదువుతున్న భారతీయ విద్యార్థి అనిల్‌కి కంప్యూటర్ సైన్స్ అంటే ఆసక్తి. తరగతుల్లో నేర్చుకున్నది సరిపోదని భావించి, ప్రతిరోజూ ఒక గంట స్వయంగా కొత్త విషయాలు నేర్చుకోవడం అలవాటు చేసుకున్నాడు. మూడు సంవత్సరాల్లో తన తరగతిలోనే కాదు, మొత్తం విశ్వవిద్యా లయంలోనే అత్యుత్తమ విద్యార్థిగా నిలిచాడు. అందులోని రహస్యం ఒక్కటే: స్వయంగా నేర్చుకునే శక్తిని పెంపొందించుకోవడం.

### వ్యక్తిగత అధ్యయన వ్యవస్థ అంటే ఏమిటి?..

వ్యక్తిగత అధ్యయన వ్యవస్థ అంటే ఏమిటంటే..అది ఒక పద్ధతి, ఒక మార్గం, ఒక శిక్షణ. మనకు సరిపోయే విధంగా మనకు మనమే రూపొందించుకునే అధ్యయన పద్ధతి. అందరు విద్యార్థులు ఒకేలా ఉండరు. ఒకరికి ఉదయం చదువు బాగా పనిచేస్తుంది; మరొకరికి రాత్రి. ఒకరికి నిశ్శబ్దం అవసరం; మరొకరికి సంగీతం. అందుకే వ్యక్తిగత అధ్యయన వ్యవస్థ అనేది మనసును అర్థం చేసుకోవడం నుండి మొదలవుతుంది. ఒకసారి ఒక గురువు తన శిష్యుడిని అడిగాడు. "నువ్వు ఎప్పుడు బాగా నేర్చుకుంటావు?"..అని. శిష్యుడు చెప్పాడు: "గురువుగారూ, నేను ఒంటరిగా ఉన్నప్పుడు.'..'గురువు నవ్వి 'అయితే నీ గురువు నువ్వే' అన్నాడు. నిజంగా ఈ మాటలో గొప్ప సత్యం ఉంది. మనలోని గురువును మేల్కొలపడం అన్నది చిన్న విషయమేమీ కాదు. అదే వ్యక్తిగత అధ్యయన వ్యవస్థ యొక్క మొదటి అడుగు. ప్రపంచంలోని ప్రముఖ శాస్త్రవేత్తలు, రచయితలు, ఆవిష్కర్తలు వంటివారందరికీ ఒక సామాన్య లక్షణం ఉంది. అదే.. స్వీయ అధ్యయనం.

### నేర్చుకోవడాన్ని నేర్చుకోవాలి

వ్యక్తిగత అధ్యయన వ్యవస్థ నిర్మాణం ఒకరోజులో జరిగేది కాదు. అది ఒక ప్రయాణం. జపాన్‌లోని ఒక విద్యార్థి ప్రతిరోజూ 20 నిమిషాలు "ఈరోజు నేను కొత్తగా ఏమి నేర్చుకున్నాను?" అని తన డైరీలో రాసుకునేవాడు. మొదట్లో చిన్న విషయాలు, వ్యక్తిగత అధ్యయన వ్యవస్థ అంటే ఏమిటి?..ఒక కొత్త పదం, ఒక చిన్న గణిత సూత్రం, ఒక శాస్త్ర ప్రయోగం. కానీ, ఒక సంవత్సరం తర్వాత ఆ డైరీయే ఒక చిన్న విజ్ఞాన సర్వస్వంగా మారిందంటే అతిశయోక్తి కాదు. అప్పుడు గురువు చెప్పాడు: "నువ్వు నేర్చుకున్నది కాదు, నువ్వు నేర్చుకోవడం నేర్చుకున్నావు..అదే గొప్పది' అని. మన భారతీయ సంస్కృతిలో కూడా ఇదే భావం ఉంది. "అభ్యాసే శ్రేయో భవతి"..అభ్యాసమే శ్రేయస్సుకు దారి. స్వయంగా నేర్చుకునే శక్తి అంటే, అభ్యాసాన్ని అలవాటుగా మార్చుకోవడం. 'సాధనమున పనులు సమకూరు ధరలోన' అన్నట్లుగా, ఆ శక్తి మనలో పెరిగినప్పుడు, నేర్చుకోవడం ఒక పనిగా కాకుండా, ఒక సంతోషంగా కూడా మారుతుంది. ప్రతి కొత్త విషయం మనలో కొత్త వెలుగును అందిస్తుంది. అలాంటి వెలుగులన్నీ చేరి మన వ్యక్తిత్వాన్ని మరింత సంపూర్ణంగా తీర్చిదిద్దుతాయి. నేటి అధునాతన కాలంలో డిజిటల్ ప్రపంచం మనకు అపారమైన అవకాశాలు ఇస్తోంది. కానీ అదే సమయంలో దారి తప్పింపులు కూడా ఇస్తోందన్నది తెలిసిందే. వ్యక్తిగత అధ్యయన వ్యవస్థ అంటే ఈ రెండింటి మధ్య సమతుల్యం. ఫోన్ మన గురువు కావాలి, మన అధిపతి కాకూడదు. ఇంటర్నెట్ మనకు జ్ఞానం ఇవ్వాలి, మన దృష్టిని అది పక్కకి తప్పించకూడదు. స్వయంగా నేర్చుకునే శక్తి ఉన్న విద్యార్థి ఎక్కడైనా నిలబడగలడు. ఏ దేశంలో ఉన్నా, ఏ భాష మాట్లాడినా, ఏ పాఠశాలలో చదువుతున్నా, భవిష్యత్తు తన చేతుల్లోనే ఉంటుంది. 'అభ్యాసం కూసు విద్య' అన్నారు పెద్దలు. అభ్యాసం నిరంతరంగా కొనసాగినప్పుడు మన ఆలోచనలకు పదును పెరుగుతుంది. చిన్న విషయాల్లో కూడా కొత్త అర్థాలు కనిపిస్తాయి. నేర్చుకోవడం ఒక అంతర్ముఖ యాత్రగా మారి మన బలహీనతలను బలాలుగా మార్చే శక్తిని ఇస్తుంది. ఇదే స్వీయ అధ్యయనపు విద్య యొక్క అసలు మహిమ. ఈ విషయాన్ని విద్యార్థులు గుర్తించాలి. వ్యక్తిగత అధ్యయన వ్యవస్థ మనకు మూడు వరాలు ఇస్తుంది. స్వాతంత్ర్యం, ఆత్మవిశ్వాసం, నిరంతర అభివృద్ధి. ఈ మూడూ ఉన్న విద్యార్థి తన జీవితంలో ఏ రంగంలోనైనా ఎదగగలడు. చివరగా ఒక చిన్న సూక్తి: 'నిత్యం-నూతనం -శ్రేయస్కరం".. ప్రతిరోజూ కొత్తగా నేర్చుకోవడం మనిషిని మహోన్నతుడిని చేస్తుంది. ప్రతి విద్యార్థికి సందేశం ఇదే. మీరు నేర్చుకోవడం ఆపకండి. మీలోని గురువును మేల్కొలపండి. మీకే మీరే మార్గదర్శకులు అవండి. వ్యక్తి గత అధ్యయన వ్యవస్థను నిర్మించండి. ఎందుకంటే భవిష్యత్తు పుస్తకాలు చదివినవారిది కాదు, స్వయంగా నేర్చుకోవడం నేర్చుకున్నవారిదే!...



**వచ్చే వారం:** వచ్చే ఇరవై ఏళ్ల వృత్తి ప్రపంచం: మారుతున్న అవకాశాలు, కొత్త దారులు

E-mail: reddyu@gmail.com

# విశేష సేవలకి..విశిష్ట సత్కారం!

## రాష్ట్రంలోనే ఉత్తమ శాఖగా నెల్లూరు రెడ్‌క్రాస్‌కి గవర్నర్ అభినందన

'సేవల్లో ఫస్ట్..పనితీరులో బెస్ట్' అంటూ అందరి ప్రశంసలు అందుకుంటున్న జిల్లా రెడ్‌క్రాస్‌కి అరుదైన గౌరవం లభించింది. రాష్ట్ర స్థాయిలో నెల్లూరు జిల్లా రెడ్‌క్రాస్ శాఖ ఉత్తమమమైనదిగా ఎంపికై గవర్నర్ ప్రశంసలందుకుంది. ఇండియన్ రెడ్ క్రాస్ సొసైటీ ఆంధ్రప్రదేశ్ శాఖ ఆధ్వర్యంలో ఇటీవల నిర్వహించిన కార్యక్రమంలో రాష్ట్రంలోనే అత్యుత్తమ సేవలందిస్తున్న జిల్లా శాఖగా రెడ్ క్రాస్ నెల్లూరు జిల్లా శాఖకు గవర్నర్ అబ్దుల్ నజీర్ చేతులమీదుగా సత్కారం లభించడం విశేషం. ఈ సందర్భంగా నెల్లూరు జిల్లా శాఖ ఛైర్మెన్ వాకాటి విజయకుమార్‌రెడ్డిని గవర్నర్ సన్మానించి అభినందించారు.


వాకాటి విజయ్‌కుమార్‌రెడ్డికి అవార్డును అందజేస్తున్న రాష్ట్ర గవర్నర్ అబ్దుల్ నజీర్

# ముఖ్యమంత్రి పర్యటనకు ముమ్మర ఏర్పాట్లు

రాష్ట్ర ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడు ఈనెల 19న కావలి మండలం తుమ్మలపెంట గ్రామ పర్యటనకు వస్తున్న నేపథ్యంలో ఏర్పాట్లలో ఎక్కడా లోటుపాట్లు లేకుండా చూడాలని జిల్లా కలెక్టర్ హిమాన్షు శుక్ల అధికారులను ఆదేశించారు. ఈనెల 14న కావలి ఎమ్మెల్యే దగుమాటి వెంకటకృష్ణారెడ్డితో కలిసి తుమ్మలపెంటను సందర్శించి, ఏర్పాట్లను పరిశీలించారు. "మత్స్యకారుల సేవలో" కార్యక్రమంలో ముఖ్యమంత్రి పాల్గొంటారని, ఇక్కడ నుంచి మత్స్యకారుల బ్యాంకు ఖాతాలకు ఆర్థిక సహాయం నగదును జమ చేస్తారని కలెక్టర్ చెప్పారు. అన్ని శాఖల అధికారులు సమన్వయంతో పనిచేయాలని కలెక్టర్ సూచించారు.


ఎమ్మెల్యే కృష్ణారెడ్డితో కలిసి ఏర్పాట్లను పరిశీలిస్తున్న కలెక్టర్ హిమాన్షు శుక్ల


## సంస్మరణ



కీ॥శే॥ కోర్సపాటి గోపాలరెడ్డి గారు - కీ॥శే॥ కోర్సపాటి సీతమ్మ గారు
నిర్యాణం : 06.05.2012 నిర్యాణం : 20.05.2020

మా ఇంటి దీపాలు, మా కంటి వెలుగులు
ఆదర్శ దంపతులు
కీ॥శే॥ కోర్సపాటి గోపాలరెడ్డి
కీ॥శే॥ కోర్సపాటి సీతమ్మ గారలను
సంస్మరించుకుంటూ...

కుమారుడు - కోడలు:
కోర్సపాటి శ్రీధర్‌రెడ్డి, USA - కోర్సపాటి శైలజ
కుమార్తెలు - అల్లుళ్ళు
మోసూరు హైమావతి - మోసూరు షణ్ముగంరెడ్డి
ఇసనాక శ్యామల - ఇసనాక జనార్థన్‌రెడ్డి, USA
చేవూరు జ్ఞానప్రసూన - చేవూరు కృష్ణారెడ్డి
మరియు మనుమలు, మనుమరాళ్ళు, మునిమనుమడు


### క్యాన్సర్ బాధితునికి..

# అండగా నిలిచిన విపిఆర్


ఎల్‌ఓసిని అందజేస్తున్న ఎంపీ వేమిరెడ్డి ప్రభాకర్‌రెడ్డి

పేదలకు సాయం అందించడంలో తాను ఎప్పుడూ ముందుంటానని నెల్లూరు పార్లమెంటు సభ్యులు వేమిరెడ్డి ప్రభాకర్‌రెడ్డి మరోసారి నిరూపించారు. దగదర్తి మండలం, చెన్నూరు గ్రామానికి చెందిన వింజం సుబ్బానాయుడు గత కొంతకాలంగా క్యాన్సర్ వ్యాధితో బాధపడుతూ, వైద్య ఖర్చుల కోసం ఎంపీ వేమిరెడ్డి ప్రభాకర్‌రెడ్డిని ఆశ్రయించారు. అందుకు వెంటనే స్పందించిన ఎంపీ వేమిరెడ్డి, ముఖ్యమంత్రి సహాయ నిధి ద్వారా రూ.5,09,000 విలువైన లెటర్ ఆఫ్ క్రెడిట్ (ఎల్‌ఓసి)ని మంజూరు చేయించారు. ఆ పత్రాన్ని బాధితుడికి అందజేస్తూ, మెరుగైన వైద్యం పొంది త్వరగా కోలుకోవాలని ఆకాంక్షించారు. ఆపద సమయంలో తమకు అండగా నిలిచిన ఎంపీ వేమిరెడ్డి ప్రభాకర్‌రెడ్డికి బాధితుడు, వారి కుటుంబ సభ్యులు కృతజ్ఞతలు తెలియజేశారు.

### డాక్టర్ పెళ్లకూరు జయప్రదకు..

# జీవిత సాఫల్య పురస్కారం


'జీవిత సాఫల్య పురస్కారం' అందుకుంటున్న డా. పెళ్లకూరు జయప్రద

నెల్లూరులోని ప్రముఖ కవయిత్రి, నవలా రచయిత్రి డాక్టర్ పెళ్లకూరు జయప్రదకు హైదరాబాద్‌లోని అమృతలత అపురూప అవార్డ్స్-2026 వారు జీవిత సాఫల్య పురస్కారం అందజేశారు. డాక్టర్ జయప్రద ఏళ్లతరబడిగా చేసిన సాహిత్య సేవలను అభినందిస్తూ ఈనెల 10న హైదరాబాద్‌లోని ఎన్టీఆర్ భవన్‌లో సన్మానించారు. ప్రముఖ సినీనటి మంజుభార్గవి, రిటైర్డ్ జడ్జి రాధిక తదితరులు పాల్గొన్నారు. డాక్టర్ జయప్రద జీవిత సాఫల్య పురస్కారం అందుకున్న సందర్భంగా నెల్లూరులోని నెరసం అధ్యక్ష కార్యదర్శులు జయప్రకాష్, పాతూరి అన్నపూర్ణ, సందడి అరుణ, సయ్యద్ నజ్మాబేగం, విజయభారతి, నాగరాజారావు, కవులు చిన్ని నారాయణరావు, అవ్వారు శ్రీధర్‌బాబు తదితరులు అభినందించారు.

# ఆత్మబంధువు..'అగ్నిమాపక దళం'


అగ్నిమాపక దళ ఫైర్‌మెన్లను అభినందిస్తున్న ఎన్‌సిసి అధికారులు

అగ్నిమాపక దళం అంటే ఆపదలో ఆదుకునే ఆత్మబంధువులంటూ 10-ఆంధ్ర నేవల్ యూనిట్ ఎన్‌సిసి నెల్లూరు లెఫ్టినెంట్ కమాండర్ మరియు క్యాంపు కమాండెంట్ గణేష్ గొదంగవే కొనియాడారు. ఇటీవల నెల్లూరు ధనలక్ష్మీపురంలోని నారాయణ సీబీఎస్‌సి రెసిడెన్సియల్ హైస్కూల్‌లో జరిగిన ఎన్‌సిసి వార్షిక శిక్షణా శిబిరంలో ఆయన పాల్గొని అగ్నిమాపక దళాల మానవీయ సేవలను, సాహసాలను వివరించారు. 'ప్రకృతి విపత్తులు - ప్రతి స్పందన- అగ్ని మాపక దళం అందించే సేవలు" అనే అంశంపై జరిగిన అవగాహన సదస్సులో కేడెట్లకు అగ్నిమాపకదళాల సేవలను వివరించారు. ఫైర్‌మెన్లు ఎం.కమలాకర్‌రావు, ఏ.ప్రసాద్ ముఖ్య అతిధులుగా విచ్చేశారు. ఈ క్యాంపుకు అడ్జటెంట్‌గా వి.మల్లికార్జున్‌రెడ్డి, ట్రైనింగ్ ఆఫీసర్‌గా గుండాల నరేంద్రబాబు వ్యవహరించారు. షిప్ మోడలింగ్ ఇన్‌స్ట్రక్టర్ రామన్, సబ్ లెఫ్టినెంట్ ఎస్‌కే. న్యామతుల్లా, సెకండ్ ఆఫీసర్లు పెంచలప్రసాద్, ఎం.సురేష్, కె.సురేష్, గర్ల్ చైల్డ్ ఇనస్ట్రక్టర్ పూజిత, చీఫ్ ఇన్‌స్ట్రక్టర్ లోకేష్, పి.ఐ స్టాఫ్ తదితరులు పాల్గొని కేడెట్లకు శిక్షణ నిచ్చారు. గుంటూరు, నెల్లూరు, తిరుపతి జిల్లాలకు చెందిన వివిధ కళాశాలలు, ఉన్నత పాఠశాలలకు చెందిన ఎన్‌సిసి క్యాడెట్లు ఈ శిబిరంలో శిక్షణ తీసుకుంటున్నారు.

# వియత్నాంకి.. మన మొక్కజొన్న

• కృష్ణపట్నం పోర్టు నుంచి బయలుదేరిన నౌక



మొక్కజొన్న ఎగుమతి నౌకను జెండా ఊపి ప్రారంభిస్తున్న జిల్లా కలెక్టర్ హిమాన్షు శుక్ల

నెల్లూరు జిల్లా రైతులు పండించిన మొక్కజొన్నకు మెరుగైన మార్కెట్ అవకాశాలు కల్పించేందుకు జిల్లా యంత్రాంగం తీసుకున్న చర్యల్లో భాగంగా కృష్ణపట్నం పోర్టు నుంచి మొక్కజొన్న నౌక ఈనెల 12న వియత్నాంకి బయలుదేరింది. జిల్లా కలెక్టర్ హిమాన్షు శుక్ల, అదానీ కృష్ణపట్నం పోర్ట్ లిమిటెడ్ ముఖ్య కార్యనిర్వాహణ అధికారి జగదీష్‌పటేల్‌తో కలిసి కృష్ణపట్నం పోర్టులో మొక్కజొన్న ఎగుమతి నౌకను జెండా ఊపి ప్రారంభించారు. రైతులకు గిట్టుబాటు ధరలు కల్పించాలనే ఉద్దేశంతో జిల్లా కలెక్టర్ తీసుకుంటున్న ప్రత్యేక చర్యల్లో భాగంగా, మొక్కజొన్న ఎగుమతి ప్రారంభమైంది. ఎం.వి. పర్వరాజ్ పేరుతో బయలుదేరిన ఈ నౌక ద్వారా 53,318 మెట్రిక్ టన్నుల మొక్కజొన్నను వియత్నాంకు ఎగుమతి చేస్తున్నారు. ఈ ఏడాది జిల్లాలో మొక్కజొన్న పంట అధికంగా దిగుబడి రావడంతో రైతులకు గిట్టుబాటు ధరలు లభించేలా జిల్లా కలెక్టర్ ప్రత్యేక దృష్టి సారించారు. ఈ నేపథ్యంలో అదానీ కృష్ణపట్నం పోర్ట్ లిమిటెడ్, వ్యవసాయ శాఖ అధికారులతో సమన్వయం చేసుకుంటూ జిల్లా అధికార యంత్రాంగం మొక్కజొన్న ఎగుమతులకు అవసరమైన ఏర్పాట్లను చేపట్టింది. మొక్కజొన్న ఎగుమతుల ద్వారా రైతులకు విస్తృత మార్కెట్ అవకాశాలు లభించడంతో పాటు, వ్యవసాయ ఉత్పత్తులకు అంతర్జాతీయ స్థాయిలో డిమాండ్ పెరుగుతుందని అధికారులు భావిస్తున్నారు. రైతుల ఆదాయం పెంచేందుకు ప్రభుత్వం, జిల్లా యంత్రాంగం తీసుకుంటున్న చర్యల్లో ఇది ఒక ముఖ్యమైన ముందడుగుగా పేర్కొన్నారు.

## కొడవలూరులో వేసవి విజ్ఞాన శిబిరం

కొడవలూరు గ్రంథాలయంలో ఈనెల 11న లైబ్రేరియన్ రాజేశ్వరి ఆధ్వర్యంలో వేసవి విజ్ఞాన శిబిరం నిర్వహించి చిన్నారులకు పుస్తకపఠనం, క్విజ్ పట్ల ఆసక్తిని కలిగించారు. విశ్రాంత ప్రధానోపాధ్యాయులు వెంకయ్య పాల్గొని విజ్ఞానాన్ని అందించే గ్రంథాలయాల విశిష్టతను, పుస్తకాల ప్రాముఖ్యతను వారికి తెలియజేశారు.

## ప్రతి సండే..
# పెట్రోల్ బంకులకు హాలిడే!

పెట్రోల్‌బంకులకు సెలవు దొరికింది. ప్రతి ఆదివారం ఇక అవి పనిచేయవు. మే 14 నుంచే ఈ కొత్త నిర్ణయాన్ని అమలు చేస్తున్నట్లు పెట్రోలుబంకు యజమానుల సంఘం ప్రకటించింది. పర్యావరణ పరిరక్షణలో భాగంగా పెట్రోలును పొదుపుగా వాడుకోవాలని, తద్వారా ఇంధన వనరులను కాపాడుకోవాలని ప్రధాని మోడీ ఇచ్చిన పిలుపుతో పెట్రోలు బంకుల యజమానుల ఈ నిర్ణయం తీసుకున్నారు. ఇకపై దేశంలోని 8 రాష్ట్రాల్లో.. ఆంధ్రప్రదేశ్‌తో పాటు తమిళనాడు, తెలంగాణ, కేరళ, కర్నాటక, పుదుచ్చేరి, మహారాష్ట్ర, ఒరిస్సాల్లో ప్రతి ఆదివారం పెట్రోలు బంకులు మూతపడనున్నాయి.

## 'మేరా యువ భారత్' ఆధ్వర్యంలో..
# నేషనల్ టెక్నాలజీ డే

'నేషనల్ టెక్నాలజీ డే' (జాతీయ సాంకేతిక దినోత్సవం) సందర్భంగా ఈనెల 11న నెల్లూరు జిల్లా కోవూరు సమీపంలోని ప్రభుత్వ ఐటీఐ కళాశాలలో 'మేరా యువ భారత్' ఆధ్వర్యంలో వేడుకలు నిర్వహించారు. సెంట్రల్ బ్యూరో ఆఫ్ కమ్యూనికేషన్ కేంద్ర సమాచార ప్రసార మంత్రిత్వ శాఖ-భారత ప్రభుత్వం నెల్లూరు తరపున ప్రతినిధి పి.హరికృష్ణ ముఖ్యఅతిథిగా తన ప్రసంగంలో జాతీయ సాంకేతిక దినోత్సవం ప్రాముఖ్యతను తెలియజేశారు. "నేటి ఆధునిక యుగంలో టెక్నాలజీ అనేది ఒక ఆయుధం లాంటిదని, యువత దీనిని కేవలం వినోదం కోసమే కాకుండా, దేశాభివృద్ధికి మరియు తమ ఉపాధి అవకాశాలను మెరుగుపరుచుకోవడానికి ఉపయోగించాలని సూచించారు. డిజిటల్ విప్లవం ద్వారా అందుబాటులోకి వచ్చిన కమ్యూనికేషన్ సాధనాలను వాడుకుని సరికొత్త ఆవిష్కరణలకు నాంది పలకాలని కోరారు. 'మేరా యువ భారత్' వంటి వేదికల ద్వారా యువత తమలోని సృజనాత్మకతకు పదునుపెట్టి, వికసిత్ భారత్ నిర్మాణంలో భాగస్వాములు కావాలని పిలుపునిచ్చారు. కళాశాల ప్రిన్సిపల్ శ్రీధర్‌రెడ్డి, అధ్యాపకులు సుకుమార్, సురేష్ ఇతర సిబ్బంది పాల్గొని సాంకేతిక విద్యపై విద్యార్థులకు అవగాహన కలిగించారు.

## టూకీగా...



### ఆత్మకూరులో బడిబాట-జ్ఞానబాట

ఆత్మకూరు ప్రభుత్వ ఉన్నతపాఠశాలలో ఈనెల 12న బడిబాట-జ్ఞానబాట ర్యాలీ నిర్వహించారు. మండల విద్యాశాఖ అధికారులు అనంతలక్ష్మి, చలపతిల ఆధ్వర్యంలో ఉపాధ్యాయులు పాల్గొని ప్రభుత్వ విద్య ప్రాముఖ్యతను తెలియజేశారు. ప్రభుత్వ పాఠశాలల్లో తమ పిల్లలను చదివించుకుని ప్రయోజకులను చేయాలనే అవగాహనను తల్లితండ్రులకు కల్పించారు.

### రాపూరులో ఉచిత కంటివైద్య శిబిరం

రాపూరులో ఈనెల 12న చాగణం లలితమ్మ-భాస్కరరావు మెమోరియల్ ట్రస్ట్ ఆధ్వర్యంలో జరిగిన ఉచిత కంటి వైద్య శిబిరంలో 170 మంది రోగులు పాల్గొన్నారు. శ్రీ వేంకటేశ్వర అరవింద్ నేత్రాలయ వైద్యబృందంవారు రోగులను పరీక్షించి ఉచితంగా మందులు, కళ్లద్దాలు ఇచ్చారు. మేనేజింగ్ ట్రస్టీ చాగణం గౌరీశంకర్, సీఇఓ సీతారామానాయుడు పర్యవేక్షించారు.

### మనుబోలులో హెల్మెట్‌పై అవగాహన

మనుబోలు జాతీయ రహదారిపై ప్రయాణించే ద్విచక్ర వాహనదారులు తప్పనిసరిగా హెల్మెట్ ధరించాలని మనుబోలు ఎస్ఐ రాజేష్ చెప్పారు. ఈనెల 12న ఆయన స్థానిక ప్రజల్లో ఆమేరకు అవగాహన కలిగించారు. రోడ్డు ప్రమాదాలు జరగకుండా వాహనదారులంతా అప్రమత్తంగా ఉంటూ వాహనాలు నడపాలని సూచించారు.

### వంజివాకలో ఇంటింటి సర్వే

కోట మండలం వంజివాక గ్రామంలో ఈనెల 12న ఇంటింటి సర్వే నిర్వహించారు. గృహగణన కార్యక్రమాన్ని తహశీల్దారు జయజయరావు పరిశీలించారు, గ్రామంలో ఎన్ని ఇళ్లున్నాయి, యజమానులెల వివరాలు వగైరాలన్నీ ఈ సర్వేలో నమోదు చేస్తున్నట్లు తెలిపారు. గృహ యజమానులు సర్వేకి సహకరించాలని ఆయన కోరారు.

### మాదరాజుగూడూరులో అగ్ని ప్రమాదం

నెల్లూరు రూరల్ మండలం మాదరాజుగూడూరు గ్రామంలో ఈనెల 11వ తేదీ రాత్రి సమయంలో లక్ష రూపాయల విలువైన గడ్డివామి ప్రమాదవశాత్తూ అగ్నిప్రమాదానికి గురైంది, బాధితులు లబోదిబోమంటూ మంటలు ఆర్పే ప్రయత్నం చేస్తుండగా, అగ్నిమాపకశాఖ వారు వచ్చి మంటలను అదుపులోకి తెచ్చారు. అయితే, అప్పటికే గడ్డివామి పూర్తిగా దగ్ధమైంది.

### దుత్తలూరు వైద్యశాల తనిఖీ

మండల కేంద్రమైన దుత్తలూరులోని ప్రాథమిక ఆరోగ్య కేంద్రాన్ని ఈనెల 11న జిల్లా ఇమ్యునైజేషన్ అధికారిణి డాక్టర్ ఉమామహేశ్వరి తనిఖీ చేశారు. ఫార్మసీ గదిని, రికార్డులను పరిశీలించారు. ప్రజలకు అందుతున్న వైద్యసేవలను అక్కడి సిబ్బందిని అడిగి తెలుసుకున్నారు. ఆరోగ్య కేంద్రం వైద్యాధికారితో పాటు, సిబ్బంది పాల్గొన్నారు.

### కావలిలో వస్త్ర సంచులు పంపిణీ

ప్లాస్టిక్‌కి ప్రత్యామ్నాయంగా, పర్యావరణ హితమైన వస్త్ర సంచులను వినియోగించుకోవాలంటూ, కావలిలోని రైతుబజార్ వద్ద జాగో స్వచ్ఛంధసేవా సంస్థ వారు ఈనెల 11న ప్రజలకు ఉచితంగా గుడ్డ సంచులు పంపిణీ చేశారు. కావలి 1టౌన్ ఎస్ఐ మహమ్మద్ ఖాసీం, జనవిజ్ఞాన వేదిక సభ్యులు, జాగో సంస్థ ప్రతినిధులు, పలు స్వచ్ఛంధసంస్థల వారు పాల్గొన్నారు.


### కోవూరులో ఉచిత హోమియో వైద్యశిబిరం

కోవూరు తహశీల్దార్ కార్యాలయం వద్ద ఈనెల 11న ఉచిత హోమియో వైద్యశిబిరం నిర్వహించారు. గ్రీవెన్స్‌డే సందర్భంగా ప్రతి సోమవారం తహశీల్దార్ కార్యాలయానికి వచ్చే ప్రజలకు అందుబాటులో ఈ శిబిరాన్ని ఏర్పాటు చేశారు. హోమియో వైద్యం అనేకరకాల జబ్బులను నయం చేస్తుందని ఇనమడుగు హోమియో వైద్యులు డాక్టర్ కరుణాకర్ ప్రజలకు వివరించారు.

# ఆర్తత్రాణ పరాయణ – 'విశ్వంభర' వెంకయ్యస్వామి!

నెల్లూరు కలెక్టరు కార్యాలయంలో అడ్మినిస్ట్రేటివ్ ఆఫీసరుగా పని చేసి, తహశీల్దారుగా పదవీ విరమణ పొందిన దంపూరు రామకృష్ణ ఇటీవల రచించి, భారత పూర్వ ఉపరాష్ట్రపతి ముప్పవరపు వెంకయ్యనాయుడు ద్వారా ఇటీవల గొలగమూడిలోని అవధూత.. భగవాన్ శ్రీ వెంకయ్యస్వామి వారి మందిరంలో ఆవిష్కరింపబడ్డ "విశ్వంభరుడు" అనే గ్రంథాన్ని చదువుతున్నప్పుడు..నాకు మొదటగా పాల్కురికి సోమనాథుని పండితారాధ్య చరిత్ర గుర్తు కొచ్చింది. పాల్కురికి వలె రచయిత రామకృష్ణ భక్తుల చరిత్రలను గ్రంథస్తం చేసి కృతార్థుడయ్యాడు. భక్తుడు-భగవంతుడు ఒకడేనా? అసలు భక్తుల చరిత్ర లెందుకు? అన్న ప్రశ్న వేసుకున్నప్పుడు మనకు ఆది శంకరులవారి "అహం బ్రహ్మాస్మి" అన్న అద్వైత తత్త్వము, రామానుజాచార్యులవారి "అంశ – అంషి" అనబడే విశిష్టాద్వైత తత్త్వం గుర్తుకు రాక మానవు.

ఈ "విశ్వంభరుడు" గొప్ప పరిశోధనాత్మక గ్రంథం. ఆధ్యాత్మిక గ్రంథాలు అలవోకగా రాయగల రామకృష్ణ, గతంలో గొలగమూడి సమీపంలోనే ఉన్న కనుపర్తిపాడులో ఉన్న శ్రీ సుబ్రహ్మణ్యేశ్వర స్వామి దేవాలయం గురించి ఒక గ్రంథాన్ని 2023లో వెలువరించారు. 2020 సం.లో రామకృష్ణ "అగ్నిస్వరూపుడు" పేరుతో తెచ్చిన వెంకయ్యస్వామి వారి చరిత్రలో అనేకమంది భక్తుల అనుభవాలను పరిశీలించి, స్వామివారి ఆశ్రమాలు, మందిరాలు ఆంధ్ర దేశంలో ఎక్కడెక్కడ ఉన్నది పరిశీలించి ఒక గ్రంథం ప్రచురించారు. దానికి కొనసాగింపుగా, ఈ "విశ్వంభరుడు" గ్రంథం ఆవిష్కరించారు. ఈ గ్రంథానికి నాగినేని లక్ష్మయ్యనాయుడు, భారతి దంపతులు ఊపిరి పోసిన ప్రాణదాతలని కీర్తించారు. దీనికి ప్రముఖ పరిశోధక రచయిత కాళిదాసు పురుషోత్తం, ఇంకా తదితరులు ముందుమాటల నందించి ఈ గ్రంథం విశిష్టతను తెలియజెప్పారు. "విశ్వంభరుడు" అంటే ఈ "విశ్వాన్ని భరించేవాడు" లేదా "లోకాన్ని రక్షించి పోషించేవాడు" అని అర్థం. "ఆకలై కొంగు పట్టేవారికి పట్టెడన్నం పెట్టాలి" అన్న ఉపదేశాన్నిచ్చిన భగవాన్ వెంకయ్యస్వామిని ఈ విధంగా పిలవడం అర్థవంతం, సముచితంగా భావిస్తున్నాను. ఈ సందర్భంగా అన్నదానం విశిష్టతను రచయిత ఎంతో గొప్పగా చెప్పారు.





రచయిత:
**దంపూరు రామకృష్ణ**
వెల: రూ. 100/- పేజీలు: 375
ప్రతులకు: దంపూరు పద్మావతి
26-14-114, వనంతోపు,
కొండాయపాలెం రోడ్డు, నెల్లూరు - 4.
సెల్: 9182214952.

భగవాన్ శ్రీ వెంకయ్యస్వామి వారితో అత్యంత సన్నిహితంగా మెలిగిన వారి జీవిత విశేషాలను, ఆధ్యాత్మిక అనుభవాలను, అంతర్జాతీయ శాస్త్రవేత్త కొల్లా వేంకటరమణయ్య మొదలు ఆత్మకూరు రామకృష్ణ వరకూ ఉన్న, 24మంది భక్తుల గురించి 'తరంగములు' పేరుతో విపులంగా వివరించారు. ఇవన్నీ భక్తులకు ఆధ్యాత్మిక చింతనను కలిగించి, సంఘశ్రేయస్సుకు తోడ్పడేందుకు సహాయపడగలవు. తరువాత శ్రీ వెంకయ్యస్వామి సేవలో తమ జీవితాలను ధన్యం చేసుకొని తరించిన శిష్యులు, సేవకుల వంటి వారైన మరో 26 మంది జీవిత విశేషాలను పొందుపరచారు. గొలగమూడి వెంకయ్యస్వామివారి ఆరాధనోత్సవాల విశిష్టతను ఈ గ్రంథంలో బాగా వివరించారు. గొలగమూడిలో జరుగుతున్న విద్య, వైద్య సదుపాయాలను, ఆశ్రమాన్ని సందర్శించే భక్తులకు లభించే వివిధ వసతి సదుపాయాలు వివరించారు.

ఒక్క మాటలో చెప్పాలంటే ఈ గ్రంథం గొలగమూడిని దర్శించే భక్తులకు కరదీపికగా ఉన్నది. శ్రీ వెంకయ్యస్వామి వారి జీవిత విశేషాలు, భక్తుల ఆధ్యాత్మిక అనుభవాలు, స్వామివారికి గల దివ్య శక్తులు, భక్తులను పులకింపజేస్తాయి. ఎన్నో వ్యయప్రయాసలకోర్చి ప్రచురించిన ఈ పరిశోధనా గ్రంథం, వెంకయ్యస్వామి వారి గురించి సంపూర్ణంగా తెలియజెప్పే గ్రంథమనడంలో ఎట్టి అతిశయోక్తీ లేదు. 375పేజీల ఈ గ్రంథం 100 రూపాయలకే లభించడం భక్తుల సౌలభ్యం కోసమే! గ్రంథ కర్త దంపూరు రామకృష్ణ ఇలాంటి ఎన్నో ఆధ్యాత్మిక గ్రంథాలను వెలువరించి భక్త లోకానికి అందజేయగలరని ఆకాంక్షిస్తున్నాను.



**డా.టేకుమళ్ళ వెంకటప్పయ్య**
సెల్: 9490400858



10వ వర్ధంతి

గుడిలేని దైవం 'అమ్మ' .. కల్మషం లేని ప్రేమ 'అమ్మ'..

అమృతం కన్నా తియ్యనైన పలుకు 'అమ్మ' .. మా గుండె పలికే ప్రతిమాట 'అమ్మ'

# శ్రీమతి పందిళ్ళపల్లి అరుణమ్మ

మా అమ్మ అరుణమ్మ పదవ వర్ధంతిన స్మరించుకొంటూ.. అంజలి ఘటిస్తున్నాము.

కుమారుడు - కోడలు
**పందిళ్ళపల్లి హేమంత్ రెడ్డి - సింధు**

మనుమరాలు - మనవడు
**కామాక్షి హన్విత రెడ్డి , వియాన్ష్ రెడ్డి**

కుమార్తె - అల్లుడు
**నిరూప - చెర్లో కోటారెడ్డి**

Inventive

Edited, Published, Printed & Owned by **THUNGA SIVAPRABHATH REDDY**, Plot no:1&2, Main Road, Magunta Layout, NELLORE-524003. Printed & Published at **Roopa Graphics**, Magunta Layout, NELLORE-3. Cell: 9866314741. Editor-**THUNGA SIVAPRABHATH REDDY,** Managing Editor : **T.BHARATHI REDDY,** Sub-Editor : **MADDURU SRINIVASULU.** e-mail: lawyerpatrika@gmail.com